గరిష్ఠం 30.5
కనిష్ఠం 23.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	67,674	67,674
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.95 (4.18)	4,132.84	3,983.93
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.604 (45.1540)	55,235	58,800

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పాడి ఆవులు, పాడి గేదెల రక్షణతో పాటు ఇతర పశువుల్లో వ్యాధుల నివారణకు పశుసంవర్ధకశాఖ దృష్టిసారించింది. ప్రధానంగా పశువుల్లో కాళ్లవాపు వ్యాధి అంటే ఎఫ్ఎండీ (ఫుట్ అండ్ మౌత్ డిసీజెస్) రాకుండా ఉండేలా టీకాలను ప్రతీ ఆరు నెలలకోసారి వేస్తున్నారు. ఈ టీకాలతో పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. అందుకు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

పశువుల్లో వ్యాధుల నియంత్రణకు టీకా

ఆవులు, గేదెలతో పాటు ఇతర పశువులను కాళ్ల వ్యాధి నుంచి రక్షించడం టీకాల ముఖ్య ఉద్దేశం. ప్రతీ ఆరునెలలకోసారి క్రమం తప్పకుండా ఈ టీకాలు వేస్తారు. గత నెల 15న ప్రారంభమైన టీకాల కార్యక్రమం ఈనెల 15వ తేదీతో ముగియనుంది. ఎఫ్ఎండీ వ్యాధులతో పాటు ఇతర వైరస్‌లను కూడా నియంత్రించేందుకు ఎఫ్ఎండీ టీకాలతో కలిపి ఇతర టీకాలు కూడా వేస్తారు.

- 70శాతానికి చేరిన ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్
- ప్రతీ పశువు వివరాలు 'భారత్ పశుధన్' యాప్‌లో నమోదు
- ఆరు నెలలకోకసారి టీకాలు
- పాడి ఉత్పత్తులు తగ్గకుండా అధికారుల కార్యాచరణ

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 3.50లక్షల తెల్ల, నల్ల పశువులు అంటే గేదెలు, ఆవులు ఉన్నాయి. పాడి ఉత్పత్తులను పెంచడంతో పాటు వాటిని కాపాడేందుకు, వైరస్ వ్యాప్తిని నియంత్రించేందుకు ప్రభుత్వం టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇప్పటి వరకు 70శాతం వరకు వ్యాక్సినేషన్ పూర్తయింది. ఏటా రెండు సార్లు టీకాలు వేయడం వల్ల వైరస్ వ్యాప్తి తగ్గుముఖం పట్టి పశువులకు రక్షణ కలుగుతోంది. పశుసంపద తగ్గితే పాల ఉత్పత్తులపై పడనున్నందున ప్రతీ గ్రామానికి అధికారులు వెళ్లి టీకాలు వేయనున్నారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా 78 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో డాక్టర్‌తో పాటు ఫార్మసిస్ట్, గోపాల మిత్ర, పశుమిత్రలు ఉంటారు.

పశువుల వివరాలు 'భారత్ పశుధన్' యాప్‌లో

పశువులకు టీకాలు వేయడంతోపాటు పశుసంపద వివరాలను 'భారత్ పశుధన్' యాప్‌లో అధికారులు నమోదు చేయనున్నారు. పశువుకు సంబంధించిన యజమాని, ఇతర వివరాలన్నింటినీ నమోదు చేస్తారు. పశువుకు టీకా ఇచ్చిన వెంటనే రైతు ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వెళ్తుంది. ఆ ఓటీపీ ఆధారంగా వివరాలు నమోదు చేస్తారు. గాలికుంటువ్యాధి నివారణకు టీకా వచ్చినా ఆ వివరాలను యాప్‌లో నమోదుచేస్తారు. దీని ఆధారంగా ఎన్ని పశువులకు టీకా పూర్తయిందో తెలియనుంది. టీకా వేసిన 21 రోజుల తరువాత పశువుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎఫ్ఎండీ అంటువ్యాధికావడంతో టీకా కార్యక్రమం ద్వారా ఇతర పశువులకు ఈ రోగం దరిచేరకుండా ఉంటుంది. అదేవిధంగా ప్రతీ పశువుకు ట్యాగ్ వేస్తారు. ఒకవేళ ట్యాగ్ ఊడినా, తిరిగి టీకాలు వేసే సమయంలో ట్యాగ్‌ను వేసి రికార్డుల్లో నమోదు చేస్తారు.

ప్రతీ పశువుకు టీకా వేయించాలి

గాలికుంటు వ్యాధి నివారణకు సంబంధించిన టీకాలను ప్రతీ రైతు పశువులకు వేయించాలి. ఇప్పటికే 70శాతానికి పైగా టీకాల కార్యక్రమం పూర్తయింది. ఈనెల 15 వరకు ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తాం. ప్రతీ పశువుకు సంబంధించిన యజమాని వివరాలతో పాటు ఆ పశువుకు సంబంధించిన వివరాలన్నీ యాప్‌లో నమోదవుతాయి. ఎఫ్ఎండీ వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రతీ ఆరు నెలలకోసారి టీకా కార్యక్రమం నిర్వహిస్తాం. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. పశుసంపదను కాపాడటం కోసం, పాడి ఉత్పత్తిని పెంచడం కోసం ప్రతీ ఒక్కరు సహకరించి ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.
- జీవీ.రమేష్, పశుసంవర్ధకశాఖ జేడీ, నల్లగొండ

డైట్ కాంట్రాక్టర్ల ఎంపిక 12కు వాయిదా



నల్లగొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో డైట్ సరఫరా కాంట్రాక్టర్ల ఎంపికను ఈనెల 12కు అధికారులు వాయిదా వేశారు. జిల్లాలోని మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ, నకిరేకల్ ఏరియా ఆస్పత్రులతోపాటు మర్రిగూడెంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో రోగులకు ఆహారం అందించే కాంట్రాక్ట్ నిమిత్తం ఏజెన్సీల నుంచి అక్టోబరులో టెండర్లను ఆహ్వానించారు. ఈనెల 4వ తేదీనే టెక్నికల్ బిడ్లతో పాటు ఫైనాన్షియల్ బిడ్లను తెరవాల్సి ఉండగా, టెండర్ల ప్రక్రియ నిర్వహించే కమిటీ ఛైర్మన్ బాధ్యతల్లో ఉండే అదనపు కలెక్టర్ ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో 7వ తేదీకి వాయిదా వేశారు. తాజాగా, శుక్రవారం సైతం అధికారులు అందుబాటులో లేకపోవడం, ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉన్న నేపథ్యంలో ఈ టెండర్ల ప్రక్రియను 12వ తేదీకి వాయిదా వేశారు. టెండర్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి ఏజెన్సీలను ఎంపికచేస్తామని అధికారులు పేర్కొంటుంటే, మరోవైపు కాంట్రాక్టులు దక్కించుకునేందుకు కొన్ని ఏజెన్సీల నిర్వాహకులు రాజకీయ ఒత్తిడి తెస్తున్నట్లు చర్చ సాగుతోంది. ఈ కాంట్రాక్టుల నిమిత్తం 53 ఏజెన్సీలు టెండర్లు దాఖలు చేశాయి. నిబంధనల ప్రకారం కనిష్ఠ ధర కోట్ చేసిన ఏజెన్సీలకు కాంట్రాక్ట్ అప్పగించాల్సి ఉంటుండగా, అన్ని ఏజెన్సీలు ఒకే ధర కోట్ చేస్తే డ్రా నిర్వహించాల్సి ఉంటుంది.

అయితే నాణ్యమైన డైట్ సరఫరా, ఏజెన్సీల ట్రాక్‌రికార్డు, టర్నోవర్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని కాంట్రాక్టర్లను ఎంపికచేసే కమిటీ ఛైర్మన్ హోదాలో ఉండే అదనపు కలెక్టర్, కన్వీనర్ హోదాలో ఉండే డీసీహెచ్ఎస్‌కు ఉండే విస్తృతాధికారాల మేరకు నేరుగా ఏజెన్సీ ఎంపికచేసే అవకాశం ఉంది. ఈ వెసలుబాటును అనుకూలంగా మలుచుకునేందుకు రాజకీయనేతల ద్వారా కొందరు ఏజెన్సీల నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించాలని పలువురు ఏజెన్సీల నిర్వాహకులు కోరుతున్నారు.

దేశభక్తి పెంపొందించేందుకే జాతీయ గీతాలాపన

కలెక్టర్ ఇలా త్రిపాఠి



అధికారులతో జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పౌరుల్లో దేశభక్తి భావనను పెంపొందించేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు వందేమాతర జాతీయ గీతం సామూహిక ఆలాపన కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులు, సిబ్బందితో కలిసి వందేమాతరం జాతీయ గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బంకించంద్ర చటర్జీ వందేమాతర గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా జాతీయ గీత సామూహిక ఆలాపన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, ఆర్డీవో వై.అశోకొరెడ్డి, కలెక్టరేట్ ఏవో మోతిలాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను వేగవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రం సమీపంలో ఎస్ఎల్‌బీసీ కాలనీ వద్ద చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను ఆమె తనిఖీ చేశారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి తరగతి గదులు, విద్యార్థులు ఉండేందుకు డార్మెటరీ, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతీ నెల పనులను పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి ఉన్నారు.


బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ జేఏసీ ఛైర్మన్ మునాస ప్రసన్నకుమార్

నల్లగొండ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానికసంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, పార్లమెంట్‌లో బిల్లును ఆమోదింపజేసి రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్లో చేర్చాలని బీసీ జేఏసీ ఛైర్మన్ మునాస ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక క్లాక్‌టవర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల చివరలో జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో 42శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేయాలని, లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వంపై ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి బీసీ బిల్లుపై ప్రధాని మోదీని ఒప్పించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు గండిచెరువు వెంకన్నగౌడ్, ఐతగోని జనార్ధన్‌గౌడ్, ఎంఏ.ఖదీర్, పుట్ట వెంకన్నగౌడ్, కర్నాటి యాదగిరి, చిలుకరాజు సతీష్, మార్గం సతీష్‌కుమార్, కొంపల్లి రామన్నగౌడ్, చెన్నోజు రాజు, చెన్నోజు భరద్వాజ, కల్లూరి సత్యనారాయణగౌడ్, నీలం వెంకటమధు, అనంత నాగరాజు గౌడ్, గడగోజు విజయ్, తలారి రాంబాబు, ఆమంచి స్వామి, అంబటి శివ, పుల్లెందుల అంజయ్య, గద్దం మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

డీఆర్డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీడీ శేఖర్‌రెడ్డి

త్రిపురారం నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసిందన్నారు. ధాన్యంలో తేమశాతం 17కు మించకుండా ఉండాలని, ఆరబెట్టి తాలు మట్టి లేకుండా తీసుకురావాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో విజయకుమారి, ఏపీవో నాగేందర్‌ల, మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, మర్ల చంద్రరెడ్డి, శ్యాంసుదర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నరేష్, కామర్ల జానయ్య, తదితరులు ఉన్నారు.

ధాన్యం.. దైన్యం

- 10రోజులుగా నిలిచిన కాంటాలు
- రైతుల పడిగాపులు
- తేమ కోసం అధికారుల పేచీ
- ఆరబెట్టేందుకు లోడుకు రోజుకు రూ.1,000
- మార్కెట్ యార్డులో వృథాగా ఉన్న డ్రయ్యర్



తిప్పర్తి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం

మిర్యాలగూడ,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తడి, పొడి వాతావరణంలో నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఆరబెట్టలేక సతమతమవుతున్నారు. కాసేపు ఎండ, అంతలోనే మబ్బులు, చినుకుల కారణంగా రోజువారీగా ధాన్యాన్ని ఆరబెట్టి కుప్పపోసేందుకు కూలీలకు రోజుకు రూ.700, ట్రాక్టర్‌కు రూ.1000 ఖర్చు అదనంగా రైతులపై భారం పడుతోంది. తేమ శాతం తగ్గలేదని అధికారులు కాంటాలు నిలిపివేయడంతో రైతులు రోజుల తరబడి రాశుల వద్దే పడిగాపులు పడుతన్నారు. మరో వైపు రైతుల కు ఉపయోగకరంగా ఉండేందుకు ప్రతికూల వాతావరణంలోనూ ధాన్యాన్ని గంటల వ్యవధిలో ఆరబెట్టేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన డ్రయ్యర్లు వృథా గా పడివున్నాయి. వీటిని అందుబాటులోకి తెచ్చి ఇ బ్బందులను తొలగించాలని రైతులు వేడుకుంటున్నారు.

ఐకేపీ కేంద్రాల్లో ప్రారంభంకాని కొనుగోళ్లు

ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు గడిచినా ఇప్పటి వరకు ఒక్క బస్తా సన్నధాన్యం కూడా కొనుగోలు చేయలేదని రైతులు చెబుతున్నారు. భారీ మొత్తంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తున్నా, తేమశాతం కారణంగా కాంటాలు

- మిగతా 8వ పేజీలో...

ధాన్యం రంగు మారిందని మిల్లర్ల కొర్రీలు

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్): ధాన్యం రంగు మరిందని మిల్లర్లు లారీలను తిప్పి పంపిస్తున్నారు. నల్లగొండ మండలంలోని దండెంపల్లి గ్రామంలోని ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రంలోని ధాన్యం వర్షాలతో తడిసి రంగుమారింది. ఆ ధాన్యంలో తేమ శాతం తగ్గడంతో కొనుగోలుచేసిన కేంద్రం నిర్వాహకులు మిల్లుకు తరలించారు. అయితే ధాన్యం నల్లగా ఉందని దిగుమతి చేసుకునేందుకు మిల్లర్లు నిరాకరించారు. నల్లగా ఉన్న ధాన్యానికి బస్తాకు రెండు కిలోల కోత విధిస్తున్నారు. నల్లగా మరిందని ధాన్యం కాంటా వేయకుండా సుమారు 2వేల బస్తాల ధాన్యం ఐకేపీలో నిల్వ ఉంది. అదే విధంగా నర్సింగ్‌భట్ల ఐకేపీ కేంద్రానికి ధాన్యం ఎక్కువగా రావడంతో స్థలం సరిపోక రైతుల నుంచి బస్తాకు రూపాయి వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

తేమ తగ్గినా.. ధాన్యంలో కోత

(ఆంధ్రజ్యోతి, తిప్పర్తి): ధాన్యంలో 17శాతం తేమ వచ్చినా మిల్లర్లు కోత విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యంలో 17శాతం తేమ వచ్చాక ఐకేపీ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు కాంటా వేసి మిల్లులకు పంపిస్తున్నారు. అక్కడ మిల్లర్లు ధాన్యాన్ని పరిశీలించి ఒక్కో లారీకి 5 నుంచి 6 క్వింటాల మేర కోత విధిస్తున్నారు. వానాకాలం వరిలో తాలుశాతం అంతగా ఉండదు. ధాన్యంలో కొనుగోలు కేంద్రాల్లో ఏఈవోలు పరిశీలించే నిర్వాహకులు కాంటా వేస్తున్నారు. అయితే మిల్లుల వద్దకు వెళ్లాకే ధర, కోత మిల్లర్లు చెప్పిందే తుదినిర్ణయంగా అవుతోంది. ఏదోఒక సాకుచెబుతూ ప్రతీ లారీలో కోత విధిస్తున్నారు. మిల్లర్లు అక్రమంగా కోత విధిస్తున్నారని, ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండల పరిధిలోని అంతయ్యగూడెం, ఆనేదార్‌పల్లి, గడ్డికొండారం, రామలింగాలగూడెం గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు.

ఇబ్బందులు రాకుండా చూడాలి.



ధాన్యంలో తేమ 17శాతం వచ్చాక కొనుగోలు కేంద్రంలో కాంటా వేసి మిల్లుకు తీసుకెళ్లాం. అయితే మిల్లు నిర్వాహకులు బియ్యం శాతం తక్కువగా ఉందని చెప్పి లారీని తిప్పి పంపారు. కొంత ధాన్యం కోత విధించి దిగుమతి చేసుకోవాలని కోరినా వినలేదు. అదే ధాన్యం నల్లగొండలోని మరో మిల్లులో విక్రయించాం. అధికారులు పట్టించుకొని రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి.
- అంజిరెడ్డి, రైతు , రెడ్డికాలనీ, నల్లగొండ.

పత్తి రైతులను ఆదుకోవాలి

కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా చేతికొచ్చిన పత్తి, వరి పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కలెక్టర్ ఇలా త్రిపాఠిని కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో కార్యకర్తలు, రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి కలెక్టర్‌కు ఫోన్‌చేసి రైతు సమస్యలు విన్నవించారు. వర్షాలతో రైతులు సగానికి పైగా పంటలు నష్టపోయారని పేర్కొన్నారు. పండిన కొద్దిపాటి పంట విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. తేమశాతం ఎక్కువగా ఉందని పత్తిని కొనుగోలు చేయకపోవడంతో దళారులను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. అదే పత్తిని దళారులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో దళారుల దందా కొనసాగుతోందని, ఈ ప్రాంతంలో దళారులు ఎంత మంది ఉన్నారో లెక్క తేల్చాలని పోలీసులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దిగుబడులను కొనుగోలు చేయించాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే విన్నవించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న లింగయ్య

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌ను వెంటనే విడుదల చేయాలని జిల్లా ధర్మ స్టూడెంట్స్ యూనియన్ (డీఎస్‌యూ) రాష్ట్ర కోకన్వీనర్ తలారి లింగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం డీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యాహక్కు నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందన్నారు. విద్యార్థి సంక్షేమ పథకాల్లో నెలకొన్న దీర్ఘకాలిక జాప్యాన్ని తక్షణమే పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పెండింగ్ బకాయిల కారణంగా ప్రైవే ట్ కళాశాలలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. దీం తో పలు కళాశాలలు ఫీజు చెల్లించాలని విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయన్నారు. అదేవిదంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన, కాలపరిమితితో కూడిన రోడ్ మ్యాప్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుభాష్, పెరిక సురేష్, మహేష్, సిద్దు, కిరణ్, సాయికిరణ్, సందీప్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి కార్తీకమాస రద్దీ



పూజల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ సతీమణి ఇందిర

కనగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయానికి కార్తీక మాసం రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారిని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సతీమణి ఇందిర దర్శించుకున్నారు. ఆలయంలో జరిగిన కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆమెకు ఆలయ ముఖ్య అర్చకులు మల్లాచారి, అ ర్చకులు దామోదర్‌రావ్ వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారి శేషవస్త్రాలను కమిటీ ఛైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో నాగిరెడ్డి అందజేశారు. అనంతరం మహిళా భక్తులకు అదనపు కలెక్టర్ సతీమణి ఇందిర వాయినాలు ఇచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ జూనియర్ అసిస్టెంట్లు కూసం ఉపేందర్‌రెడ్డి, రాజయ్య, సిబ్బంది శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

సుజలాం, సుఫలాం వందేమాతరం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందేమాతరం గీతం మార్మోగింది. స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరిపోసిన వందేమాతర గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిన శుక్రవారం ప్రతీ మండలంలో వేడుకగా ఆలపించారు. ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గీతం యొక్క ప్రాముఖ్యాన్ని వక్తలు వివరించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు 150 ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు. పలుచోట్ల రహదారులపై నిలబడి ఆలపించారు.


మునగాలలో రహదారిపై వందేమాతరం ఆలపిస్తున్న విద్యార్థులు



మేళ్లచెర్వు, నార్కట్‌పల్లి పాఠశాలల్లో 150 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు



గుట్ట వైకుంఠద్వారం ఎదుట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో వందేమాతర గీతాన్ని సామూహికంగా ఆలపిస్తున్న పోలీస్ సిబ్బంది, విద్యార్థులు


నల్లగొండ మునిసిపల్ కార్యాలయంలో వందేమాతరం ఆలాపన




హాలియాలో జాతీయజెండాతో ఆలపిస్తున్న చిన్నారులు, మునుగోడు మండలం పులిపలుపుల రైతు వేదిక వద్ద నినాదాలు చేస్తున్న రైతులు


చింతపల్లి పీహెచ్‌సీ వద్ద వందేమాతరం ఆలపిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఎవరికి వారే బ్రాండ్

● హోటళ్లు, వ్యక్తుల పేర దర్జాగా విక్రయాలు
● నిబంధనలకు విరుద్ధంగా ప్లాంట్‌ల నిర్వహణ

హోటళ్లు, ఇతర సంస్థల లేబుల్స్ వేస్తూ విచ్చలవిడిగా వాటర్ బాటిల్స్‌ను విక్రయిస్తున్నారు. నాణ్యతకు తిలోదకాలు ఇస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. అనుమతులు లేకుండా వాటర్‌ప్లాంట్స్ నిర్వహించడమే కాకుండా ఎలాంటి ప్రమాణాలు పాటించకుండానే వేల లీటర్ల నీటిని విక్రయిస్తున్నారు. ఇటీవల యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో నిబంధనలకు విరుద్ధంగా లేబుళ్లు వేస్తూ వాటర్ బాటిల్స్ విక్రయిస్తున్న ప్లాంట్‌ను సీజ్ చేశారు. వినియోగదారులకు అవగాహన లేకపోవడంతో పరిశుభ్రమైన నీరు అని తాగేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

తాగునీటి కోసం ప్యూరిఫైడ్ నీటిపై అనేక మంది ఆధారపడుతున్నారు. ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నా ప్రజలు ప్యూరిఫైడ్ నీటిపైనే తీసుకుంటున్నారు. దీంతో ప్రతీ గ్రామంలో కనీసం రెండు నుంచి నాలుగువరకు వాటర్‌ప్లాంట్లు నెల కొన్నాయి. నాసిరకం క్యాన్లు, పరిశుభ్రత పాటించకుండానే రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. జిల్లాలో 500కు పైగా వాటర్ ప్లాంట్స్ ఉన్నట్లు సమాచారం. కూల్‌వాటర్, మినరల్‌వాటర్ పేరుతో విక్రయాలు సాగిస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు

నీటిని శుభ్రపరిచే యంత్రాలకు ప్రభుత్వపరంగా ఎటువంటి గుర్తింపు ఉండటంలేదు. క్యాన్లలోకి నీళ్లుపట్టే ముందు యూవీకెనాల్‌తో శుభ్రపర్చాలి. క్యాన్‌లను ప్రతిరోజూ పొటాషియం పర్మాంగనేట్ లేదా హైపో సొల్యూషన్‌తో శుభ్రం చేయాలి. ఆ తర్వాత శుభ్రం చేసిన తేదీని, బ్యాచ్ నెంబర్‌ను సీల్‌పై ముద్రించాలి. శానిటరీ అధికారులతో ప్రతి నెలా నీటిని పరీక్షింపజేసి బీఐఎస్(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్) పంపించాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియ ఏదీ జరగడం లేదు. వాటర్ ప్లాంట్‌లో వినియోగించే పైపులు, నిల్వ చేసే ట్యాంక్‌లు, స్టీలువి వినియోగించాల్సి ఉన్నా ప్లాస్టిక్ వాటిని వాడుతున్నారు. కొంత మంది మునిసిపల్ నీటిని క్యాన్‌ల్లో నింపి మినరల్ వాటర్‌గా విక్రయాలు చేస్తున్నా తనిఖీలు చేసేవారు కరువయ్యారు. 20 లీటర్ల వాటర్ క్యాన్‌ను గ్రామాల్లో రూ.7 నుంచి రూ.10 దాకా విక్రయిస్తుండగా పట్టణంలో రూ.10 నుంచి రూ.15దాకా విక్రయిస్తున్నారు.

పుట్టగొడుగుల్లా వాటర్‌ప్లాంట్స్

సూర్యాపేట జిల్లాలో ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఐఎస్ఐ గుర్తింపు ఉందని పేర్కొనడం తప్ప అందుకు తగ్గ నిబంధనలు ఏవీ అనుసరించడం లేదు. ఇక అనధికార ప్లాంట్లు 400కి పైగానే ఉన్నట్లు సమాచారం. ఇంట్లో బోర్ వేయడం దానికి మోటార్ బిగించి ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్ పేరుతో నీటిని విక్రయిస్తున్నారు.జిల్లా కేంద్రంలో మునిసిపాలిటీ అందించే నీటిని తాగడానికి కాకుండా మిగతా అవసరాలకు వినియోగిస్తున్నారు. సూర్యాపేటలో 17 ప్లాంట్స్‌కు మాత్రమే అనుమతి ఉండగా అంతకు పదిరెట్లలో ప్లాంట్స్ ఉన్నాయి. జిల్లాలోని మిగతా మునిసిపాలిటీల్లోనూ ఇదే తీరున ప్లాంట్స్ వెలిశాయి. ఇదిలా ఉండగా ఐఎస్ఐ గుర్తింపు కోసం బీఐఎస్ అనుమతితో పాటు, లైసెన్సు ఫీజు రూ.99 వేలు చెల్లించాల్సి ఉంది. అంతేకాకుండా ప్రతి ఏడాదికోసారి రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. మునిసిపాలిటీకి ఏడాదికి చెల్లించాల్సిన రూ.1000 కూడా కొన్ని ప్లాంట్ల నిర్వాహకులు చెల్లించడంలేదని సమాచారం.



చౌటుప్పల్‌లోని ఓ ప్లాంట్‌లో అధికారులు సీజ్ చేసిన వివిధ లేబుళ్లతో ఉన్న వాటర్ బాటిళ్లు

నీళ్లు అవే.. పేర్లే మారుతాయ్

హోటల్, దాబా నిర్వాహకులు తమ వ్యాపారం లబ్ధికోసం ఎలాంటి అనుమతి లేకుండా వారి హోటల్స్, దాబా పేర్లను బాటిల్‌పై ముద్రిస్తున్నారు. సూర్యాపేటలో బిర్యానిసెంటర్లు, హోటళ్లు సుమారు 15వరకు ఉండగా వాటిల్లో 10కి పైగా హోటళ్లు తమ హోటల్ పేరుతో వాటర్‌బాటిళ్లను అందజేస్తున్నారు. వీరితో పాటు రాజకీయ నాయకులు తమపేరుతో కార్యకర్తలకు,ప్రజలకు బాటిళ్లు అందజేస్తున్నారు. నీళ్లు అవే కాగా, పేర్లు మాత్రం మారుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఎక్కడో ఒక చోట దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

అనుమతి ఒక పేరుతో..

యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపల్ పరిధిలోని తాళ్లసింగారంలో ఒక వ్యక్తి వాటర్ బాటిళ్లు విక్రయించడానికి అనుమతి తీసుకున్నాడు. అయితే నిబంధనలకు విరుద్ధగా టీస్టాల్స్, హోటళ్లు, దాబాల పేరుతో లేబుళ్లు ముద్రించి వాటర్‌బాటిల్స్ హోల్‌సేల్‌గా విక్రయించాడు. సమాచారం మేరకు అధికారులు, పోలీసులు వాటర్‌ప్లాంట్‌పై దాడి చేసి వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేశారు. వాటర్ బాటిల్ తయారుచేసే లేబుళ్ల టీడీఎస్ మిషన్లను, పీహెచ్‌సీ మిషన్లు, వివిధరకాల వాటర్‌బాటిళ్లను స్వాధీనం చేసుకుని, యజమానిపై కేసు నమోదు చేశారు. ఇది కేవలం అధికారుల దృష్టికి వచ్చిన వాటర్‌ప్లాంట్ కాగా వారి దృష్టికి రానివి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనేకం ఉన్నాయి.

అనుమతులు లేని ప్లాంట్లపై చర్యలు

మునిసిపల్ అనుమతులు లేకుండా వాటర్ ప్లాంట్స్ నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. ప్లాంట్ నిర్వహణకు మునిసిపల్ నుంచి నోఅబ్జక్షన్ సర్టిఫికెట్ విధిగా పొందాలి. అంతేకాక ప్లాంట్ నిర్వహించాలంటే బీఎస్ఐ నిబంధనల ప్రకారం మైక్రోబయాలజిస్టు, కెమిస్ట్రీ ఉండాలి. పరిశుద్ధమైన నీటినే వినియోగించాలి.

సీహెచ్ హన్మంతరెడ్డి, మునిసిపల్ కమిషనర్

ర్యాగింగ్‌తో జీవితాన్ని కోల్పోతారు


కళాశాలలో పర్యటిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ

నల్లగొండ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ర్యాగింగ్ చేస్తే కళాశాల నుంచి బహిష్కరణకు గురికావడమే కాకుండా, క్రిమినల్ కేసులు నమోదై విలువైన జీవితాన్ని కోల్పోతారని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండ జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ జరిగినట్లు ప్రచారం నేపథ్యంలో శుక్రవారం అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, ఆర్డీవో అశోక్‌రెడ్డిలతో కలిసి వైద్యకళాశాలను కలెక్టర్ సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, హెచ్‌వోడీలు, అధ్యాపక బృందం, విద్యార్థి సంఘాల నాయకులు, మెంటర్లు, విద్యార్థులతో ఆమె విడివిడిగా చర్చించారు. మీడియాలో వచ్చిన వార్తల దృష్ట్యా నిజంగా వైద్యకళాశాలలో జరిగిన సంఘటనలను వివరించాలని ఆమె విద్యార్థులను అడిగారు. తమను ఎవరు ర్యాగింగ్ చేయ లేదని, స్నేహపూర్వక వాతావరణంలోనే తాము ఉన్నామని విద్యార్థులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్ అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని, ఎవరైతే ర్యాగింగ్‌కు పాల్పడుతారో వారు చట్టరీత్యా తప్పుచేసిన వారవుతారన్నారు. వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. ఎక్కడైనా ర్యాగింగ్‌కు పాల్పడినా, ర్యాగింగ్ రూల్స్‌కు వ్యతిరేకంగా ప్రవర్తించినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి రికమండేషన్లు పనిచేయవని హెచ్చరించారు. ఏవైనా సమస్య ఉంటే విద్యార్థులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నల్లగొండ ప్రభుత్వ వైదకళాశాలలో ర్యాగింగ్ జరిగినట్టు విద్యార్థుల నుంచి జిల్లా యంత్రాంగానికి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. విద్యార్థుల మాటల్లో సీనియర్లు జూనియర్లతో స్నేహపూర్వకమైన వాతావరణంలోనే మెలిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తల్లిదండ్రులను బాధపెట్టకుండా వారి గురించి ఆలోచించాలని హితబోధ చేశారు. ర్యాగింగ్‌తో అందరికీ చెడ్డ పేరు వస్తుందన్నారు. వైద్య కళాశాల్లోని సీసీటీవీ ఫుటేజీలను సైతం పరిశీలిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఇకపై వైద్య కళాశాలను, విద్యార్థుల గదులను ఆకస్మికంగా తనిఖీ చేస్తామన్నారు. తప్పుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అదే సమయంలో ఏవైనా సమస్యలు ఉంటే విద్యార్థులు జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకు రావాలన్నారు. అధికారుల ఫోన్ నెంబర్లను విద్యార్థులకు తెలిపారు.

అదుపు తప్పి లారీ బోల్తా

గరిడేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ గెలలతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా హాలియా నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్ సమీపంలోని అంపాపూర్ పామాయిల్ ఫ్యాక్టరీకి పామాయిల్ గెలలతో లారీ వెళ్తోంది. అప్పన్నపేట గ్రామ శివారులోకి రాగానే లారీ అదుపుతప్పి బోల్తా పడింది. వెంటనే స్థానికులు లారీ క్యాబిన్ నుంచి డ్రైవర్‌ను బయటికితీశారు. డ్రైవర్ అస్గర్‌కు గాయాలు కాగా 108వాహనంలో హుజూర్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఈఘటనపై ఎస్ఐ నరేష్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.


క్యాబిన్ నుంచి డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

తలనొప్పిగా మారిన టెంకాయల విక్రయ వేలం

నార్కట్‌పల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థుల మధ్య కుదరని ఏకాభిప్రాయం, రాజకీయ ఆధిపత్య వివాదాలు వెరసి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో కొబ్బరి కాయల విక్రయ వేలం నిర్వహణ అధికారులకు తలనొప్పిగా మారింది. మూడు పర్యాయాలు నిర్వహించిన టెంకాయల విక్రయ వేలం వేలాకోళంగా మారుతోందన్న విమర్శలు వినపడుతున్నాయి. ఫలితంగా ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ ఆదాయానికి గండిపడే పరిస్థితులు నెలకొంటున్నాయి. చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లే ప్రధానమార్గం ఎల్లారెడ్డిగూడెం నుంచే ఉండటంతో భక్తుల ఇక్కడ బస్సులు దిగి వెళ్తుంటారు. దీంతో కొబ్బరికాయల విక్రయాలు ఏటేటా పెరుగుతూ రాగా గతంలోని పంచాయతీపాలకవర్గం ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో కొబ్బరికాయల విక్రయ వేలం హక్కుపొందే విధానాన్ని తీసుకువచ్చింది. దీంతో ఇది గ్రామపంచాయతీకి ఆదాయ వనరుగా మారింది.


ఎల్లారెడ్డిగూడంలో టెంకాయల విక్రయ వేలం నిర్వహిస్తున్న అధికారులు

గుడి కోసం రూ.10లక్షల కేటాయింపు

పంచాయతీ పరిధిలోని పురాతన పాదం గుడి నిర్మాణానికి గ్రామస్థులు సంకల్పించారు. ఇందుకు కావాల్సిన నిధులను విరాళంగా గ్రామపంచాయతీ టెంకాయల టెండర్ నిధుల సమయంలో రూ.10 లక్షలు చెల్లించాలని 2013 నుంచి 2018 వరకు ఉన్న పాలకవర్గం ఏకవాక్యంతో నిర్ణయించింది. దీంతో కొబ్బరికాయల విక్రయ వేలం హక్కు పొందాలనే ఆసక్తి ఉన్న వేలందారు రూ.10 లక్షలను పాదం గుడి అభివృద్ధికి అనధికారికంగా ఇచ్చేలా నిర్ణయించారు. ఆ మేరకు 2014 నుంచి 2017 వరకు మూడేళ్ల పాటు అనుకున్న ప్రకారం రూ.10 లక్షలను వేలందారులు చెల్లించగా గుడి నిర్మాణాన్ని చేపట్టారు. 2018-2023 వరకు కొనసాగిన పంచాయతీ పాలకవర్గం సమయంలో కరోనా రావడం అస్తవ్యస్థంగా మారింది. అప్పటి నుంచే పాదం గుడికి డబ్బులను కేటాయించే విధానానికి బ్రేకులు పడ్డాయి. కానీ ఈ కాలంలో పేరుకుపోయిన బకాయల వివాదం నేటికీ కొనసాగుతూనే ఉంది. కొబ్బరికాయల వేలం బకాయిల వివాదం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ వివాదాలకు ఆజ్యం పోసింది.

రూ.10లక్షల కేటాయింపుపై మళ్లీ ప్రస్తావన?

ఇదిలా ఉంటే తాజాగా నిర్వహిస్తున్న కొబ్బరికాయల విక్రయ వేలం ద్వారా పాదంగుడికి రూ.10 లక్షలు కేటాయించాలనే డిమాండ్‌పై గ్రామస్థుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. గతంలో ఇచ్చిన డబ్బులకే లెక్క చూపలేదని కొందరు, బకాయిలు వసూలు చేయలేకపోయారని మరికొందరు వర్గాలుగా విడిపోయి విమర్శలకు దిగారు. ఫలితంగా టెండర్ నిర్వహణ కాలం ముగిసి దాదాపు నెల రోజులు గడుస్తున్నా కొత్త టెండర్ వేయడంలో అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. గత పాట కన్నా తక్కువ పాడితే నిబంధనలు అంగీకరించవు, ఎక్కువ పాడేందుకు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వంటి చిక్కుల మధ్య అధికారులు నలిగిపోతున్నారు.

నాలుగోసారి వాయిదా

ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఏడాది కాలపరిమితికి శుక్రవారం నిర్వహించిన టెంకాయల విక్రయ వేలం నాలుగోసారి వాయిదా పడింది. గతంలో మూడు పర్యాయాలు బహిరంగ వేలం నిర్వహించినా ప్రభుత్వ కనీస ధర పలకలేదు. దీంతో శుక్రవారం మరోసారి వేలం నిర్వహించారు. ఈ వేలం పాటకు మొత్తం 5 గురు వేలందారులు హాజరు కాగా ఎల్లారెడ్డిగూడెంనకు చెందిన చిక్కుళ్ల శివ అత్యధికంగా రూ.33,50,000లు మాత్రమే పాడారు. ప్రభుత్వ మద్దతు ధర రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ వేలం పాటలో డీఎల్‌పీలో వెంకటేశ్వర్లు, పంచాయతీ ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

పోలీసులపై దాడి చేసిన ఇద్దరి రిమాండ్

చండూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బహిరంగంగా మద్యం తాగవద్దని అడ్డు చెప్పిన ఇద్దరి పోలీసులను ముగ్గురు యువకులు మద్యం మైకంలో చితకబాదారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా చండూరు మునిసిపాలిటీలో జరిగింది. ఎస్ఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం మండలంలో ఇటీవల దొంగతనాలు జరుగుతున్న క్రమంలో మంగళవారం అర్ధరాత్రి చండూరులో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలోనే కారింగు క్రాంతికుమార్, మహ్మద్ సాజిద్‌బాబా, మహ్మద్ నాసర్‌పాషా బహిరంగంగా మద్యం తాగుతూ పోలీసుల కంట పడ్డారు. బహిరంగంగా మద్యం సేవించవద్దని, త్వరగా అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. కానీ అప్పటికే మద్యం మైకంలో ఉన్న యువకులు పోలీసులను తిడుతూ దాడికి పాల్పడటంతో పోలీసులకు స్వల్పగాయాలయ్యాయి. కానిస్టేబుల్స్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసి, ముగ్గురు యువకులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు. బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

అనారోగ్యంతో వ్యాపారి ఆత్మహత్య


కృష్ణంరాజు(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వెన్నుపూస నొప్పితో బాధపడుతున్న ఓ ఫైనాన్స్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ పట్టణ పరిధి తంగెడపల్లి గ్రామానికి చెందిన చీకూరి కృష్ణంరాజు(49) హైదరాబాద్‌లోని ఉడాసాయి నగర్‌లో నివాసం ఉంటూ ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. ఇటీవల నొప్పి ఎక్కువ కావడంతో నిద్రపట్టడం లేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన కృష్ణంరాజు మండలంలోని దామెరలోని వ్యవసాయ క్షేత్రంలో క్రిమిసంహారక మందు తాగాడు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి ఇంట్లో కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కృష్ణంరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నూతనకల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ఎర్రపహాడ్ గ్రామశివారులో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెదనేమిల గ్రామానికి చెందిన కాసోజు మురళి(62) జంగం లాజర్ కలిసి పోలుమళ్ల గ్రామానికి వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్తుండగా గుర్తుతెలియని వాహన ఢీకొనడంతో మురళి తలకు తీవ్రగాయాలు కాగా లాజర్‌కు చెయ్యి విరిగింది. ఇరువురిని 108 వాహనంలో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మురళి మృతి చెందాడు. అతడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నరేష్ మూడు నెలల క్రితం రోడ్ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజలతో పోలీసులు మమేకం కావాలి

కొండమల్లేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పోలీసులతో ప్రజలతో మమేకం అవుతూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ మేనేజ్‌మెంట్, ఉమెన్ హెల్ప్‌డెస్క్, స్టేషన్‌రైటర్, ఎస్‌హెచ్‌వో గది, పోలీసులకు కేటాయించిన కిట్లను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసుల వివరాలు, పెండింగ్ కేసుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. 100 డయల్‌కు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఏఎస్పీ మౌనిక, సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ రమేష్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.


స్థానిక సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

న్యాయమూర్తులకు బదిలీలు

మిర్యాలగూడ లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఐదవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జీ.వేణు, సీనియర్ సివిల్ జడ్జి బీ.సుజయ్ బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న వేణు 6వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, సిటి సివిల్ కోర్టు సికింద్రాబాద్‌కు బదిలీ అయ్యారు. వేణు స్థానంలో ఖమ్మం జిల్లా న్యాయసేవా సంస్థ సెక్రటరీ కేవి.చంద్రశేఖర్‌రావు రానున్నారు. ఇదిలా ఉండగా సీనియర్ సివిల్ జడ్జి బత్తుల సుజయ్ 7వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సిటి సివిల్ కోర్టు హైద్రాబాద్‌కు పదోన్నతిపై వెళ్లనున్నారు. సుజయ్ రెండున్నర ఏళ్లుగా మిర్యాలగూడ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్నారు. సుజయ్ స్థానంలో జడ్జివెవరినీ నియమించలేదు.

పోక్సో కోర్టు న్యాయమూర్తిగా మిలింద్ కాంబ్లీ

భువనగిరి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పోక్సో(ఫాస్ట్ ట్రాక్ స్పెషల్) కోర్టు న్యాయమూర్తిగా మిలింద్ కాంబ్లీ నియమితులయ్యారు. ఈ మేరకు హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న ఆయన అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొంది భువనగిరి ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు(పోక్సో)కు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు పోక్సో కోర్టుకు అదనపు జిల్లా ప్రధానన్యాయమూర్తి ముక్తిదా ఇన్‌చార్జి న్యాయమూర్తిగా వ్యవహరించారు.

కళా ఉత్సవ్.. సిరివెన్నెల సొంతం


కళా ఉత్సవ్ అవార్డు అందుకుంటున్న సిరివెన్నెల

మిర్యాలగూడ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన విద్యార్థిని శ్రీపాద సిరివెన్నెల కళా ఉత్సవ్ అవార్డు అందుకుంది. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి విద్యనభ్యసిస్తున్న సిరివెన్నెల నృత్య ప్రదర్శనతోపాటు డ్రాయింగ్ పోటీలలోనూ రాణిస్తోంది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి డాన్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన సిరివెన్నెలకు నిర్వాహకులు కళాఉత్సవ్ అవార్డు అందజేశారు. కాగా సిరివెన్నెల గురువు కలకొండ రాము, ఎంఈవోలు రామచంద్రయ్య, బాలు తదితరులు సిరివెన్నెలను అభినందించారు.

ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపిక రేపు

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి సీనియర్ పురుషులు, మహిళల వాలీబాల్ ఎంపికలు సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 9వ తేదీన ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు నల్లగొండ వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తెలంగాణ సీనియర్ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీల కోసం ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి సీనియర్ క్రీడాకారుల ఎంపికను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రాలను తీసుకురావాలన్నారు. వివరాలకు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు సెల్:9494444870, సీతారాంరెడ్డి సంయుక్త కార్యదర్శి సెల్:9393044274ను సంప్రదించాలన్నారు.

తండ్రి వంట మనిషి..
కుమార్తెకు ఎంబీబీఎస్ సీటు


నిహారిక

మఠంపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన సామిరెడ్డి నర్సింహారెడ్డి-నాగలక్ష్మి దంపతుల కుమార్తె నిహారిక వైద్య సీటు సాధించారు. తల్లి నాగలక్ష్మి చిన్నతనంలోనే మృతి చెందగా, తండ్రి నర్సింహారెడ్డి అన్నీ తానై పెంచి పెద్దచేశాడు. నర్సింహారెడ్డి ప్రైవేటు పరిశ్రమ కంపెనీలో వంట పనులు చేస్తూ తన కుమార్తెను చదివించారు. ఇటీవల జరిగిన నీట్ పరీక్షలో అర్హత సాధించి 375వ ర్యాంకు సాధించి హైదరాబాద్‌లోని ముషీరాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో సీటు సాధించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


అందె లక్ష్మి, మర్రి లక్ష్మి

నల్లగొండ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని నర్సింగ్‌భట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 4న కట్టంగూరు మండలంలోని చెర్వుఅన్నారం ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 బాలికల విభాగంలో మర్రి లక్ష్మి, అందెం లక్ష్మి, అండర్-17 బాలికల విభాగంలో కానుగు హారిక ఎంపికయ్యారు. నారాయణపేట జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.మారయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మల్లీశ్వరీ, ఫిజికల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు.

కొనసాగుతున్న స్పోర్ట్స్ మీట్


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

నాగార్జునసాగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్ కాలనీలో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల స్పోర్ట్స్ మీట్ రెండోరోజు శుక్రవారం కొనసాగింది. రెండో రోజు పోటీల్లో 200 మీటర్ల పరుగు పందెంలో సాగర్ బీసీ గురుకులానికి చెందిన ఎం.గణేష్, ప్రథమ స్థానంలో నిలవగా 800 మీటర్ల పరుగు పందెంలో అనంతారానికి చెందిన బన్నీ ప్రథమ స్థానంలో నిలిచారు. డిస్కస్‌త్రోలో అనంతారంనుంచి అరవింద్ ప్రథమస్థానంలో నిలిచారు. ఖోఖో విభాగంలో అనంతారంపై నాగార్జునసాగర్ విజయం సాధించింది. కబడ్డీ విభాగంలో అనంతారం, కనగల్ సెమీస్‌కి చేరాయి. వాలీబాల్ విభాగంలో భూదాన్‌పోచంపల్లి, రాజాపేట జట్లు సెమీస్‌కి చేరాయి. శనివారం వాలీబాల్ విభాగంలో భూదాన్‌పోచంపల్లి, అనంతారం, కబడ్డీలో నేరేడుచర్ల, అనంతారం, ఖోఖోలో కేతేపల్లి, నాగార్జున సాగర్‌లు ఫైనల్‌లో తలపడనున్నట్లు ప్రిన్సిపల్ రవి కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ క్రీడా పోటీలు ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగనున్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాలో 16 బీసీ గురుకుల పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

వేరుశనగ సాగుకు
మొగ్గు



- దేవరకొండ డివిజన్‌లో యాసంగికి పెరుగనున్న సాగు
- జాతీయ పంట నూనెల మిషన్ పథకం అమలు
- కేంద్రం సబ్సిడీతో జిల్లాలోని ఎనిమిది మండలాలకు వేరుశనగ విత్తనాల సరఫరా

కేంద్రం అందిస్తున్న సాయంతో రైతులు వేరుశనగ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. జాతీయ పంట నూనెల మిషన్ పథకం అమలులో భాగంగా సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేస్తుండడంతో, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోనున్నారు. ఈ పథకం కింద జిల్లాలోని ఎనిమిది మండలాలకు వేరుశనగ విత్తనాలను సరఫరా చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

దేవరకొండ డివిజన్‌లో యాసంగికి వేరుశనగ పంట సాగు పెరుగనుంది. కేంద్ర ప్రభుత్వం జాతీయ వంట నూనెల మిషన్ పథకాన్ని నల్లగొండ జిల్లాలోని ఎనిమిది మండలాల్లో అమలు చేస్తోంది. దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, పీఏపల్లి, తిరుమలగిరి(సాగర్), మునుగోడు, కట్టంగూరు మండలాల్లో యాసంగి సీజన్‌కు వందశాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను ఇప్పటికే రైతులకు సరఫరాచేశారు. దీంతో రైతులు ఉత్సాహంగా యాసంగికి వేరుశనగ సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. దేవరకొండ డివిజన్‌లోని దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, పీఏపల్లి మండలాల్లో ఇప్పటికే రైతులకు కేంద్రం అందిస్తున్న వేరుశనగ విత్తనాలను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సరఫరాచేశారు.

యాసంగికి సిద్ధమవుతున్న రైతులు

యాసంగి సాగుకు వేరుశనగ పంటలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. దేవరకొండ మండలంలో 500 హెక్టార్లలో 1,125 క్వింటాళ్లు, డిండి మండలానికి 474.44 హెక్టార్లలో 1,067.49 క్వింటాళ్లు, చందంపేట మండలంలో 500 ఎకరాల్లో 1,125 క్వింటాళ్లు, నేరేడుగొమ్ము మండలంలో 500 హెక్టార్లలో 1,125 క్వింటాళ్లు, పీఏపల్లి మండలంలో 50 హెక్టార్లలో 112.5 క్వింటాళ్లు, మునుగోడు మండలంలో 40 హెక్టార్లలో 90 క్వింటాళ్లు, కట్టంగూరు మండలంలో 80 హెక్టార్లలో 180 క్వింటాళ్లు, తిరుమలగిరి(సాగర్) మండలంలో 80 హెక్టార్లలో 180 క్వింటాళ్లు వేరుశనగ విత్తనాలను రైతులకు వ్యవసాయశాఖ అధికారులు పంపిణీ చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు. జిల్లాలో 2,224.44 హెక్టార్లలో వేరుశనగ సాగు చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వేరుశనగ పంట ఉత్పత్తులును పెంచేందుకు రైతులకు సబ్సిడీపై విత్తనాలు ఉచితంగా సరఫరాచేసి ప్రోత్సహిస్తున్నారు. ప్రతీ సంవత్సరం నూనె గింజల సాగును పెంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వేరుశనగ సాగును ప్రోత్సహిస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఈ సంవత్సరం దేవరకొండ డివిజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడంతో రైతులు లక్షా70వేల ఎకరాల్లో పత్తిపంట, 55వేల ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. యాసంగి సీజన్‌లో డివిజన్‌లో 2వేల హెక్టార్లకు పైగా వేరుశనగ సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వేరుశనగ పంట లాభదాయకంగా ఉండడంతో ప్రభుత్వం సరఫరా చేస్తున్న వేరుశనగ విత్తనాలను తీసుకొని పంటలు వేసుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.


సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్ (ఫైల్)

సాగుకు సిద్ధమవుతున్నాం



యాసంగి సీజన్‌లో నాలుగు ఎకరాల్లో వేరుశనగ వేసేందుకు సిద్ధపడ్డాను. ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసింది. దీంతో పెట్టుబడులు మిగిలాయి. వేరుశనగ పంట గతేడాది కూడా సాగుచేశాను. లాభాలు వస్తాయని ఆశిస్తున్నాం.

రమావత్ నరియానాయక్, జగ్గుతండా, చందంపేట

రైతులకు ప్రోత్సాహం



కేంద్ర ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను అందజేస్తుంది. దేవరకొండ డివిజన్‌లో దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, డిండి, పీఏపల్లి మండలాల్లో రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశాం. రైతులు వేరుశనగ పంట సాగు చేసుకొని అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా ఎదగాలి. వ్యవసాయశాఖ రైతులకు సలహాలు, సూచనలు అందిస్తూ ప్రోత్సహిస్తుంది.

శ్రీలక్ష్మి, ఏడీఏ, దేవరకొండ

స్వామియే శరణం అయ్యప్ప

● అయ్యప్ప మాలదారుల దీక్షలు ప్రారంభం ● జిల్లా అంతటా ఉట్టిపడుతున్న ఆధ్యాత్మికత

అయ్యప్ప నామస్మరణ మార్మోగుతోంది. జిల్లా అంతటా ఇప్పటికే భక్తులు దీక్షబూనారు. 41 రోజులపాటు ఎంతో నిష్ఠగా చేసే దీక్షలకు ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. అయ్యప్ప మాలధారులకు సుమారు రెండు నెలలపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్)


చౌటుప్పల్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయం

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో అయ్యప్ప స్వామి మాలధారుల దీక్షలు ప్రారంభమయ్యాయి. కార్తీకమాసం పురస్కరించుకొని ఈ నెల 5వ తేదీ నుంచి అయ్యప్ప స్వామి దీక్షలు ముమ్మరమయ్యాయి. పట్టణంలోని దేవాలయంతోపాటు 20 సన్నిదానాల్లో 10 నుంచి 15 మంది అయ్యప్ప భక్తులు మండల దీక్షలను చేపట్టారు. దీక్షలను భక్తులు వచ్చే నెల 1వ తేదీ వరకు స్వీకరించే అవకాశం ఉంటుంది. 41 రోజులపాటు మాలధారులు తమ దీక్షలను కొనసాగించి శబరిమలైలోని అయ్యప్ప స్వామి దర్శనంతో ముగిస్తారు. సంక్రాంతి రోజున కనిపించే జ్యోతి దర్శనంతో స్వాములందరి దీక్షలు పరిసమాప్తమవుతాయి.

రెండు నెలలపాటు అన్నదానం

చౌటుప్పల్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో 2001 నుంచి ప్రతీ సంవత్సరం అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతీ సంవత్సరం నవంబరు 16వ తేదీ నుంచి వచ్చే జనవరి 12 తేదీ వరకు 58 రోజులపాటు మాలధారులకు మధ్యాహ్నం అన్నదానం చేస్తారు. మండలంలో సుమారు రెండువేల మంది భక్తులు అయ్యప్ప మాలలు ధరిస్తున్నారు.

వచ్చే నెల వరకూ దీక్ష స్వీకరించవచ్చు



కార్తీక మాసం ప్రారంభంనుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు అయ్యప్ప మాలధారణ స్వీకరించవచ్చు. 41 రోజుల(మండల)దీక్షల అనంతరం శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో 36వసారి మాలధారణ చేస్తున్నా. దాతల సహకారంతో 2001 నుంచి అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రతీ ఏటా రెండు నెలల పాటు మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం. ఈ నెల 16వ తేదీ నుంచి జనవరి 12 వ తేదీ వరకు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.

బొబ్బిళ్ళ మురళి, అయ్యప్ప ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, చౌటుప్పల్

యాదగిరీశుడికి సువర్ణ పుష్పార్చన

● ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవాలు


ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. అర్చకుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 21,44,808 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. కాగా, కొండకింద ఆధ్యాత్మిక వాడలో మండపాల్లో 486 దంపతులు సత్యదేవుడి వ్రతాలు జరిపించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయాన్ని పరిశీలించిన ఈవో


దుకాణాలను పరిశీలిస్తున్న ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం ఈవో ఎస్. వెంకట్రావు పరిశీలనలు చేపట్టారు. యాదగిరి కొండపై ఈవో శుక్రవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం క్యూలైన్లు, ఉచిత ప్రసాద వితరణ, ప్రసాద కౌంటర్లు, శివాలయం, దుకాణాల సముదాయాలు పరిశీలించారు. ఆయనవెంట ఇన్‌చార్జ్ డీఈవో జూశెట్టి క్రిష్ణ; సివిల్ విభాగం ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, నాగుల మహేష్‌గౌడ్, జటావత్ శంకర్‌నాయక్, పర్యవేక్షకుడు మాచర్ల రాజన్‌బాబు, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యాదగిరీశుడి చెంత వందేమాతరం జాతీయ గీతాలాపన చేశారు.

మార్కెట్‌లో మట్టి మాయం

● అభివృద్ధి పేరుతో అక్రమ రవాణా


తవ్వకాలు చేపట్టిన ప్రాంతం

మిర్యాలగూడ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌యార్డులో అభివృద్ధి పనుల పేరుతో అక్రమంగా మట్టిని తరలించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ అవంతీపురంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు 30 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. అందులో మూడు ఎకరాలు గుట్ట ఉండడంతో పశువుల సంత నిర్వహణ, గోదాముల నిర్మాణానికి అడ్డంకిగా మారిందని అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గుట్ట తొలగింపు కోసం బడ్జెట్ కేటాయించే పరిస్థితులు లేవని పేర్కొనడంతో ప్రైవేట్ వ్యక్తుల అవసరాలకు మట్టిని తరలించేందుకు నాయకుల అండదండలతో మట్టి అక్రమ రవాణా సాగించినట్లు ఆరోపణలున్నాయి. దీన్ని గుర్తించిన స్థానికులు జిల్లా అధికారులకు సమాచారం అందించడంతో మైనింగ్ శాఖ అధికారులు మార్కెట్‌యార్డును పరిశీలించారు. అనుమతులు లేకుండా చేపడుతున్న తవ్వకాలను నిలిపివేసి జరిమానా విధించారు. మార్కెట్‌యార్డులో అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మట్టపల్లివాసుడి గరుడోత్సవం



మఠంపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో శుక్రవారం రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహుని నిత్యాకల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రతీమాసం మట్టపల్లి లక్ష్మీనరసింహుడికి స్వాతీ నక్షత్ర శుభఘడియల్లో నిర్వహించే కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ పాల్గొన్నారు. అంతకుముందు కృష్ణమ్మకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యాజమాన్యాలకు కాస్త ఊరట

● కళాశాలలకు రూ.900కోట్ల రీయింబర్స్‌మెంట్ విడుదలకు ప్రభుత్వం అంగీకారం ● సమ్మె విరమించిన ప్రైవేట్ యాజమాన్యాలు

భువనగిరి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు ప్రభుత్వం అంగీకారం తెలపడంతో కొంత ఉపశమనం కలిగినట్లయింది. రాష్ట్రంలోని ప్రైవేట్ కళాశాలలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.10వేల కోట్ల బకాయిలు చెల్లించాలంటూ ప్రైవేట్ యాజమాన్యాలు ఐదు రోజులుగా సమ్మె చేపట్టిన విషయం విధితమే. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో యాజమాన్యాల ప్రతినిధులు జరిపిన చర్చలలో రూ.900కోట్ల విడుదలకు అంగీకారం కుదిరింది. దీంతో సమ్మెను విరమిస్తున్నట్లు యాజమాన్యాల అసోసియేషన్ ప్రకటించింది. దీంతో జిల్లాలోని ప్రైవేట్ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ, పీజీ, ఫార్మా, డైట్, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, న్యాయ తదితర ఉన్నత విద్యా, వృత్తి విద్యా కళాశాలలు నేటినుంచి తెరుచుకోనున్నాయి. కాగా జిల్లాలోని ప్రైవేట్ విద్యా సంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.300కోట్లు రావాల్సి ఉండగా, ప్రభుత్వమిచ్చిన హామీ మేరకు ఎంత వరకు న్యాయం జరుగుతుందోనని యాజమాన్యాలు ఎదురుచూస్తున్నాయి. అయితే సమ్మె కారణంగా వాయిదాపడిన ఫార్మా కోర్సుల పరీక్షలు, ఈ నెల 13 నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణపై త్వరలో స్పష్టత రానుంది.

విశిష్ట సేవలకు.. ప్రతిష్టాత్మక పురస్కారం

● భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబుకు 'కేంద్రీయ గృహ మంత్రి దక్షిత పతక్' పురస్కారం ● అభినందించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు

విధుల్లో అంకితభావం.. పనిపట్ల నిబద్ధతకు పురస్కారం లభించింది. నేరాల అదుపుతోపాటు సంబంధిత కేసుల్లో విచారణను వేగవంతం చేసి, పరిష్కారానికి కృషి చేసినందుకు కేంద్రం అభినందించి, పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఈ అవార్డు దక్కడం హర్షనీయమని రాచకొండ సీపీ సుధీర్ బాబు పేర్కొన్నారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్)


చంద్రబాబు


చంద్రబాబును అభినందిస్తున్న సీపీ సుధీర్‌బాబు

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భువనగిరి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నగరి చంద్రబాబు ప్రతిష్టాత్మక పురస్కారం కేంద్రీయ గృహ మంత్రి దక్షిత పతక్‌కు ఎంపికయ్యారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఈయన ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ప్రొబెషనరీ ఎస్ఐగా ఉద్యోగ బాధ్యతలు ఆరంభించారు. అనంతరం మొదటి పోస్టింగ్ నల్లగొండ జిల్లా నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో సివిల్ ఎస్ఐ. 2012లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కోస్గీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. అప్పటినుంచి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాపరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ క్రైం ఇన్వెస్టిగేషన్ (నేర దర్యాప్తు పరిశోధన)లో చురుకుగా వ్యవహరిస్తూ పలు కేసులనుఛేదించారు. ఘట్కేసర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై భువనగిరి రూరల్ సీఐగా ఇక్కడికి వచ్చారు. కాగా క్రైం ఇన్వెస్టిగేషన్‌లో అంతర్భాగమైన కేసుల పరిశోధనలో ప్రతిభ కనబరిచినందుకు ఈ నెల 3న కేంద్రీయ గృహ మంత్రి దక్షిత పతక్ పురస్కారానికి ఎంపిక చేశారు.

అవార్డు ఎంపికలో కీలకమైన నాలుగు విభాగాలు

దేశంలో అన్ని రాష్ట్రాల పోలీసుల్లో విశిష్ట సేవలు అందించినందుకు ఈ అవార్డును అందజేస్తారు. కేంద్రీయ గృహ మంత్రి దక్షిత్ పతక్ పురస్కారాల్లో నాలుగు విభాగాలుంటాయి. ఇందులో స్పెషల్ ఆపరేషన్, క్రైం ఇన్వెస్టిగేషన్, ఇంటలిజెన్స్, ఫోరెన్సిక్ సైన్స్‌లలో ప్రతిభ కనబరిచిన వారికి మినిస్టరీ ఆఫ్ సెంట్రల్ హోం అఫైర్స్ వారు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా అవార్డులను ప్రకటిస్తారు. అయితే పై నాలుగు అవార్డులను కలిపి 2024 ఫిబ్రవరినుంచి ఒకే అవార్డుగా అందజేస్తున్నారు. ఈ సంవత్సరం విధి నిర్వహణలో అత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఐజీ స్థాయి అధికారి నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు మొత్తం 1,466 మంది పోలీస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది. రాష్ట్రంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధినుంచి ఎంపికైన వారిలో భువనగిరి రూరల్ సీఐ నగరి చంద్రబాబు ఉండడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. అయితే 2026 జనవరి 26న న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాల నుంచి పురస్కారం అందుకోనున్నారు.

మరిన్ని అవార్డులు అందుకోవాలి
సీపీ సుధీర్ బాబు

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భువనగిరి రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న చంద్రబాబుకు అవార్డు ప్రకటించడంపై రాచకొండ సీపీ సుధీర్ బాబు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా చంద్రబాబును ఆయన అభినందించారు. విధి నిర్వహణలో ప్రతిభ చాటి భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని కాంక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనుల్లో భాగంగా పట్టణంలోని ప్రకాశంబజార్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ ఎం.వేణుగోపాలాచార్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని మిర్యాలగూడ రోడ్డు, ప్రకాశంబజార్, మాన్యంచెల్క, ఎస్ఆర్ గార్డెన్, రహమత్‌నగర్, అన్సారీకాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అండగా ఐఎంఏ

నల్లగొండటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ఐఎంఏ ఎల్లవేళలా అండగా ఉంటుందని సీనియర్ ఐఎంఏ డాక్టర్ జయప్రకాష్‌రెడ్డి, ఐఎంఏ స్పోర్ట్స్ కల్చరల్ చైర్మన్ డాక్టర్ పుల్లారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు ఐఎంఏ ఆధ్వర్యంలో శుక్రవారం గ్లీజర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పీవీఎన్ మూర్తి, డాక్టర్ రమేష్, డాక్టర్ విజయ్, డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలి

నల్లగొండటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఈ నెల 9న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు నెల్లికంటి రాఘవేంద్రయాదవ్ కోరారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అణగారిన వర్గాల రాజ్యాధికారం, సామాజిక న్యాయం కోసం బీసీ, ఎస్సీ ఎస్టీ జేఏసీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ధర్మయుద్ధ మహాసభకు రాష్ట్ర కన్వీనర్ విశారదన్ మహరాజ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలోని పీడిత కుల, అగ్రకుల ప్రజాస్వామ్య మేధావులు, విద్యావంతులు, సామాన్య ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు కల్యాణ్‌గౌడ్, శంకర్, తలారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును తరలించాలి

చిట్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీ పరిధిలో శివనేనిగూడెం గ్రామంలోని డంపింగ్‌యార్డును వెంటనే అక్కడి నుంచి తరలించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ శివనేనిగూడెం గ్రామంలోని 355 సర్వేనెంబర్‌లో చెత్త డంపింగ్ ఏర్పాటు చేయడం వల్ల గ్రామస్థులతో పాటు పాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త డంపింగ్ వల్ల దుర్వాసన రావడంతో పాటు దోమలు, పందులు, కుక్కలు స్వైర్యవిహారం చేస్తున్నాయన్నారు. రైతులకు, ప్రజలకు ఇబ్బంది లేనిచోటకు డంపింగ్ యార్డు తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బొబ్బల సుధాకర్‌రెడ్డి, నాయకులు ఐతరాజు యాదయ్య, పాలమాకుల అర్జున్, చొప్పరి లింగయ్య, మహాలింగారెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నాంపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలో శుక్రవారం సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం సహాయనిధి పేదలకు వరమన్నారు. 22 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.7.95లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, పానగంటి వెంకన్న, బేగరి గిరి, అన్నెపాక కిరణ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ


తవిటి వెంకటమ్మ

కట్టంగూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయు) నూతన కమిటీని గురువారం నల్లగొండలో జరిగిన జిల్లా 5వ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఈదులూరుకు చెందిన తవిటి వెంకటమ్మ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా కట్టంగూరుకు చెందిన చెరుకు జానకి, జిల్లా కమిటీ సభ్యురాలిగా అయిటిపాములకు చెందిన భూపతి రేణుక ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఆశ హక్కుల సాధన కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియమాకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మర్రిగూడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్‌నాయక్, ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ శాలిని అన్నారు. మండలకేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆరోగ్య ఆస్పత్రిలో శుక్రవారం మర్రిగూడ పోలీస్‌స్టేషన్ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్‌తో పాటు సిబ్బంది నుంచి రక్త నమూనాలను సేకరించి వివిధ పరీక్షలు చేశారు. పోలీస్ సిబ్బంది. ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా వైద్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు కూడా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణారెడ్డి, డాక్టర్ అరుణ్ జ్యోతి, డాక్టర్ దీపక్, సత్యనారాయణ, యాదగిరి, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంభవీదేవికి భక్తుల పూజలు

చిట్యాలరూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కార్తీక శుక్రవారాన్ని పురస్కరించుకుని చిట్యాల మండలం నేరడలోని శ్రీమహమ్మాయి శాంభవీదేవి ఆలయంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీమహమ్మాయి శాంభదేవీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. పురోహితులు అమ్మవారికి పూజాకార్యక్రమాలను అభిషేకాల అనంతరం పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారి దర్శించుకోవడంతో ఆలయాల్లో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది.

ధాన్యం.. దైన్యం

(5వ పేజీ తరువాయి)

వేయడం లేదని పేర్కొంటున్నారు. అవంతిపురం మార్కెట్ యార్డులో ఆలగడప, మిర్యాలగూడ, తడకమళ్ల ధాన్యం కొనుగోలుకు మూడు కేంద్రాలను అక్టోబరు 8న ప్రారంభించారు. మూడు కొనుగోలు కేంద్రాలకు కలిపి సుమారు 20వేల బస్తాల బీపీటీ ధాన్యాన్ని రైతులు తీసుకొచ్చారు. కాగా, 10 రోజులు గడిచినా తేమ కారణంగా కాంటాలు వేయకపోవడంతో రోజూ రాశులను ఆరబోసి తిరిగి సాయంత్రం కుప్పపోస్తున్నామని, దీంతో కూలీలకు కొంత చెల్లిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డివిజన్‌లో 23 కేంద్రాలకు ఎనిమిది ప్రారంభం

మిర్యాలగూడ డివిజన్‌లో 23 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉండగా, ఇప్పటి వరకు ఎనిమిది కేంద్రాలే తెరుచుకున్నాయి. వీటిలో నాలుగు కేంద్రాలు దొడ్డురకం, మరో నాలుగు సన్నధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేశారు. కాగా, మాడ్గులపల్లి ఐకేపీలో దొడ్డురకం ఆరు లారీల ధాన్యం కొనుగోలుచేయగా, సన్నరకం నేటికీ కాంటాలు వేయలేదని రైతులు చెబుతున్నారు. సన్నరకం రెండు మూడు రోజులు ఆరబెట్టిన తరువాత నాలుగో రోజు వర్షపు చినుకులు పడుతుండటంతో తిరిగి ఆరబెట్టాల్సివస్తోందని రైతులు వాపోతున్నారు.

వృథాగా డ్రయ్యర్

ప్రతికూల వాతావరణంలోనూ ధాన్యం ఆరబెట్టుకునేందుకు ప్రభుత్వం డ్రయ్యర్లను ఏర్పాటుచేసింది. ప్రయోగాత్మకంగా జిల్లాకు రెండు మంజూరు చేసింది. ఒకటి తిప్పర్తి, రెండోది మిర్యాలగూడ మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేశారు. 45 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న ట్రాక్టర్‌కు పుల్లీ ఏర్పాటు చేసి డయ్యర్‌కు అనుసంధానిస్తేనే యంత్రం పనిచేస్తుంది. మిషన్ వినియోగించే రైతులు 45 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న ట్రాక్టర్ తీసుకొస్తే, 30 లీటర్ల డీజిల్‌తో 25 క్వింటాల ధాన్యాన్ని ఆరబెట్టవచ్చు. దీంతో సమయం కలిసిరావడమేగాక, మార్కెట్‌లో పడిగాపులు తప్పుతాయి. ధాన్యం రంగు మారకుండా సకాలంలో కాంటాలు వేయడం, లేదా బస్తాల్లో నింపి నిల్వ చేసుకునేందుకు అనువుగా ఉంటుంది. అయితే చిన్న, సన్నకారు రైతుల వద్ద ట్రాక్టర్లు లేవు. పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ట్రాక్టర్‌ను ఏర్పాటు చేస్తే డ్రయ్యర్ల ద్వారా ధాన్యాన్ని ఆరబెడతామని రైతులు చెబుతున్నారు.

డ్రయర్‌ను అందుబాటులోకి తెస్తాం



ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు అవంతీపురం మార్కెట్‌కు ప్రభుత్వం డ్రయ్యర్‌ను సరఫరా చేసింది. ప్రస్తుతం అది డెమో దశలోనే ఉంది. రెండు రోజుల్లో మెకానిక్ వచ్చి పని చేసే విధానం వివరిస్తారు. ట్రాక్టర్ పుల్లీ ఉన్న రైతులకు ధాన్యం ఆరబెట్టుకునేందుకు పూర్తిస్థాయిలో యంత్రాన్ని అందుబాటులో ఉంచుతాం. ఐకేపీల్లో ధాన్యం తడవకుండా కప్పేందుకు 20 చొప్పున టార్పాలిన్లు అందుబాటులో ఉంచాం. అవసరమైతే మరిన్ని సరఫరా చేస్తాం.

-వెంకటేశ్, మార్కెట్ కార్యదర్శి

నీళ్లిలా.. చితిపేర్చేదెట్లా..?

- నీట మునిగిన గోపలాయపల్లి వైకుంఠధామం
- బాధాకర పరిస్థితుల్లో చివరి మజిలీ
- అంత్యక్రియల కోసం గ్రామస్థుల అవస్థలు



నీట మునిగిన గోపలాయపల్లి వైకుంఠధామం

నార్కట్‌పల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఊర్లను... చెరువులను ఏకం చేసిన భారీ వర్షాలు అటు రైతులను ఇటు జనజీవనాన్నే కాదు మృతి చెందిన వారి చితిమంటలను వెలగనివ్వలేదు. బతికినన్నాళ్లు ఎలా బ్రతికినా కొందరి ఆఖరి మజిలీని బాధాకర పరిస్థితుల్లో ముగించేలా చేశాయి. అసలే కట్టుబాట్లు.. హిందూ దహన సంస్కారాల్లోని ఆచార వ్యవహారాలు వ్యయభరితంగా మారిన నేపథ్యంలో ప్రస్తుతం వర్షాల ప్రభావంతో అంత్యక్రియల నిర్వహణ కుటుంబ సభ్యులకు ఆర్థిక భారంగా మారింది. మొంథా తుఫాను చివరికి మనిషి ఆఖరి ఘడియలకు నిలయమైన వైకుంఠ ధామాలను సైతం ముంపునకు గురయ్యాయి. ఫలితంగా చచ్చిన వారికి అంత్యక్రియలు....కర్మకాండలు....కుటుంబసభ్యులకు తలనొప్పిగా మారింది.

కొన్ని గ్రామాల్లో...

నార్కట్‌పల్లి మండలంలోని చాలా గ్రామాల్లో వైకుంఠధామాలు నీట మునిగాయి. చిప్పలపల్లిలో నిర్మించిన వైకుంఠధామానికి దారిలేక నేటికీ అక్కడ చితిమంటలు వెలగని పరిస్థితి. బీవెల్లెంల, నార్కట్‌పల్లి, గోపలాయపల్లి గ్రామాల్లో వైకుంఠధామాలు ముంపులో ఉన్నాయి. పదేళ్ల క్రితం వరకు గ్రామాల్లో శ్మశానవాటికలు తప్ప వైకుంఠ ధామాలు లేవు. దీంతో సమాధుల నిర్మాణ సంఖ్య పెరిగి స్థలం కొరత ఏర్పడేది. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద ప్రతీ గ్రామంలో వైకుంఠధామాలను ప్రథమ ప్రాధాన్యతగా సుమారు రూ.12 లక్షలు ఆపైన కూడా ఖర్చు చేసి నిర్మించారు. జువ్విగూడెంలో నిర్మించిన వైకుంఠధామం చూసిన వారైతే ఇది శ్మశాన వాటికేనా అని అనుకోవాల్సిన విధంగా పార్క్‌లా సిద్ధం చేశారు.

ముంపులో గోపలాయపల్లి వైకుంఠధామం

గోపలాయపల్లి గ్రామంలో నిర్మించిన వైకుంఠ ధామం కూడా నీట మునిగింది. అసలే లోతట్టు ప్రాంతం ఆపై భారీ వర్షాలతో శ్యామతోటబావి నుంచి వచ్చే వరద నీరు, ఉదయసముద్రం రిజర్వాయర్ ద్వారా విడుదల చేసిన కాల్వ నీటితో నిండిన గోపలాయపల్లి చెరువు బ్యాక్ వాటర్ వెరసి వైకుంఠధామాన్ని నిండా ముంచేశాయి. భస్మసింహాసనాలు (దహనవేదికలు) కూడా పూర్తిగా మునిగాయి. ఇది నీట మునిగి రెండు నెలలు గడుస్తున్నా నీటిని తరలించే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు. కాగా వైకుంఠధామాల్లో సమస్య వస్తే ఎవరిది బాధ్యతతో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది.


నీటిలోనే మునిగి ఉన్న (భస్మసింహాసనాలు) దహన వేదికలు

'కన్నీటి' మధ్యే సమాధి

గోపలాయపల్లిలో రెండు నెలల వ్యవధిలో ముగ్గురు చనిపోయారు. అయితే నీట మునిగిన వైకుంఠధామంలో అంత్యక్రియలు చేసేందుకు వీలు లేక ఇద్దరి మృతదేహాలకు వారి సొంత స్థలాల్లోనే కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నెల 3వ తేదీన చనిపోయిన ఓ మహిళ మృతదేహాన్ని నీటి ఊటలోనే గుంట తవ్వి అతికష్టం మీద అంత్యక్రియల చేసినట్లు కుటుంబసభ్యులు వాపోయారు.

నీటిని తొలగించాలి



గోపలాయపల్లి గ్రామ వైకుంఠధామంలో రెం డు నెలలుగా నిలిచి ఉన్న నీటిని తరలించాలి. గ్రామంలో ఎవరైనా చనిపోతే వారికి అంత్యక్రియలు నిర్వహించడం ఇప్పుడు సవాల్‌గా మారింది. సొంత స్థలాలు ఉన్న వారయితే మృతుని అంత్యక్రియలు అక్కడే చేస్తున్నారు. మరి సొంత స్థలాలు లేనివారికే ఇది సమస్యగా పరిణమించింది. లోతట్టులో ఉన్న వైకుంఠధామంలో నిలిచిన నీటిని తరలించి ఎవరైనా చనిపోతే ఆఖరి మజిలీ గౌరవప్రదంగా పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- యాట చందు, గోపలాయపల్లి

రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి తీసుకురావాలి

- తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్


మర్రిగూడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

మర్రిగూడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ఎండబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే మద్దతు ధర లభిస్తుందని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్ అన్నారు. మండల కేం ద్రంలో ఐకేపీ ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యాన్ని ఎండబెట్టి తూర్పారబట్టి తాలు లేకుండా తీసుకువస్తే తేమశాతం వస్తుందని, దీంతో మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ కూడా వస్తుందని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నిర్వాహకులు రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏవో మల్లేష్, ఎంపీడీవో మున్నయ్య, ఏపీఎం వెంకటేష్, మాల్ మార్కెట్ చైర్మన్ నక్క శ్రీను, మాల్ మార్కెట్ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్, డీసీసీ ఉపాధ్యక్షుడు జగన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, నాయకులు కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మాస నీలిమ చంద్రశేఖర్, వెంకటంపేట బాలయ్య, హరిప్రసాద్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నక్ష బాటలను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు

మర్రిగూడ: ప్రభుత్వానికి సంబంధించిన నక్ష బాటలను అక్రమంగా ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు. మండలకేంద్రంలో శాలివాహన కళాశాల సమీపంలో ప్రభుత్వ సర్వే నెంబరు 5, 165లలో గల భూమి కబ్జా చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు ప్రభుత్వ నక్షబాటను ఆయన పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందితో సర్వే నిర్వహించారు. ఇప్పటికే అక్కడక్కడ ఈ ప్రభుత్వ నక్షబాటను ఆక్రమించుకొని కబ్జా చేసి, బిల్డింగ్ నిర్మాణం కూడా చేపట్టారని తెలిపారు. గతంలో కబ్జాకు గురైన ఈ నక్షబాట మార్గాన ఇళ్లకు చేరుకునే ప్రజలు కోర్టుకు వెళ్లగా అనుకూలంగా తీర్పు ఇచ్చిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన భవనాలను కూడా కూల్చివేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజల ఫిర్యాదు మేరకు సర్వే చేస్తున్నామని, ఇంకా పూర్తిస్థాయిలో సర్వే చేయాలన్నారు. ప్రస్తుతం ఎవరైనా అక్రమంగా ప్రభుత్వ నక్షబాట భూములు కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి


ఆడిటోరియం నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు గెలుపు ఓటములను సమముగా స్వీకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. పట్టణంలోని సెయింట్ ఆల్ఫోన్సస్ పాఠశాలలో డైమండ్ జూబిలీ ఆడిటోరియం నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మోలిక్యూల్ - 2025 కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోలిక్యూల్ ఫెస్ట్ - 2025లో పాల్గొనే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ హృదయకుమార్‌రెడ్డి, బిషప్ రెవరెండ్ ఫాదర్ కరణం దమణ్‌కుమార్, బాల ఇగ్నా, బ్రదర్ సెబాస్టియన్, శాజన్ ఆంథోని, బ్రదర్ ప్రైస్ అలెక్స్, విన్సెంట్ రెడ్డి, సంతోష్ కుమార్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా వందేమాతరం గీతాలాపన

వందేమాతర గీతం 150ఏళ్ల ఉత్సవాన్ని విద్యార్థులు, యువకులు, ప్రజలు జిల్లా వ్యాప్తంగా కన్నుల పండువగా నిర్వహించుకున్నారు. సామూహికంగా వందేమాతర గీతాలాపన చేశారు. స్వాతంత్ర్యోద్యమం నాటి ఘట్టాలను అధికారులు విద్యార్థులకు చాటిచెప్పారు.


నల్లగొండలోని బెటాలియన్ వద్ద సామూహిక గీతాలాపన చేస్తున్న పోలీస్ సిబ్బంది

రామగిరి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం గీతం ఉద్యమ స్ఫూర్తిని రగిలించిందని మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ అన్నారు. వందేమాతరం గీతం ఏర్పడి 150 సంవత్సరాలు సందర్భంగా శుక్రవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో తన సిబ్బందితో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో డీఈలు ఏఈలు సిబ్బంది తదితరులు ఉన్నారు. ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్సైజ్ సిఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

చండూరు : ఆర్డీవో శ్రీదేవి, మునిసిపల్ కమిషనర్ మల్లేశం, తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ వెంకన్న ఉన్నారు.

చిట్యాల: స్థానిక తహీసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది సామూహికంగా వందేమాతరం గీతం ఆలపించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహీసీలార్ విజయ మాట్లాడారు.

మర్రిగూడ: తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి వేణుగోపాలచారి, ఎంపీడీవో మున్నయ్య, ఎస్ఐ కృష్ణారెడ్డి, వైద్యులు శాలిని దీపక్ శంకర్ నాయక్, ఏవో మల్లేష్, విజయ్, రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ నిర్మల దేవి, ప్రిన్సిపాల్ వెంకట్ గౌడ్, జ్యోతి ఉన్నారు.


మునుగోడు: రైతు వేదిక వద్ద జాతీయగీతాలాపన చేస్తున్న రైతులు

మునుగోడు రూరల్ : చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, వ్యవసాయ విస్తరణాధికారి మాదోగని నరసింహగౌడ్, మాజీ సర్పంచ్ పందుల మారయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ సింగం వెంకన్న, రైతులు చివర్ల పాపయ్య, జనగాం నరసింహా, ఒంటెపాక నరసింహా, బలుగూరి ముత్తయ్య, బొల్లం సైదులు, ఎల్లయ్య, యాదయ్య, ఖమ్మంపాడు జంగయ్య పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : జనగణమన ఉత్సవ సమితి నార్కట్‌పల్లి శాఖ అధ్యక్షుడు కన్నెబోయిన నర్సింహ, స్థానికులు పాల్వాయి భాస్కర్‌రావు, మేడబోయిన శ్రీనివాస్, దూదిమెట్ల సత్తయ్య, జెరిపోతుల భరత్, నోముల నాగరాజు, బిల్లకంటి శ్రీకాంత్, మునుకుంట్ల గణేశ్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, పల్లెర్ల నాగరాజు పాల్గొన్నారు.

కట్టంగూరు : ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో వందేమాతరం గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయలు, ఎస్ఐ రవీందర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎల్లమ్మ ఆలయం వద్ద 14న టెండర్ వేలం

కనగల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కనగల్ మండలం దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద వివిధ వస్తు విక్రయ హక్కులను (2026) ఏడాది కాలానికి హక్కుల కోసం ఈనెల 14వ తేదీన టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆసక్తి గల వారు జాతీయ బ్యాంకులో టీజీబీ నల్లగొండ నందు చెల్లుబాటయ్యే విధంగా ఎల్లమ్మ ఆల యం పేరిట డీడీ తీయాలని సూచించారు. కొబ్బరికాయ అమ్మకం వేలంలో పాల్గొనటానికి రూ.10లక్షలు, లడ్డూ, పులిహోరకు రూ.2 లక్షలు, పూలు, పండ్లకు రూ.3 లక్షలు, గాజుల విక్రయం రూ.1 లక్ష, దేవస్థానం వద్ద ఫంక్షన్‌హాల్ నిర్వహణ రూ.50 వేలు, దేవస్థానం వద్ద ఫొటోలు తీయటానికి రూ.20 వేల చొప్పున డీడీ తీయాలని సూచించారు. వాటిని 14వ తేదీ మధ్యాహ్నం 1 గంటలోపు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో షీల్డ్ టెండర్ డీడీని వేయాలని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించే వేలంలో పాల్గొనాలని వారు కోరారు.

రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక


కోట లింగయ్య

కేతేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతు సంఘం కేతేపల్లి మండల కమిటీ అధ్యక్షుడిగా చీకటిగూడెం గ్రామానికి చెందిన కోట లింగయ్య ఎన్నికయ్యారు. గురువారం జరిగిన సంఘం నాలుగో మండల మహాసభ సందర్భంగా మండల నూతన కమటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోట లింగయ్య, కార్యదర్శి చెరుకు సత్త య్య, ఉపాధ్యక్షులు ఏళ్ల అశోక్‌రెడ్డి, జనగం ఎల్లయ్య, సహాయ కార్యదర్శులు కూకుట్ల శోభన్, అల్లి ప్రభాకర్, కోశాధికారిగా గుండగోని భాగ్యమ్మతో పాటు మరో ఏడుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

వంటమనిషి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండలంలోని కస్తూర్బా బాలికల వసతిగృహంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ వంట మనిషి నియామకానికి మహిళ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో కె.మల్లిఖార్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. వంటల్లో అనుభవం కలిగి ఆసక్తి ఉన్న మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పశువులకు టీకాలను వేయించాలి


పశువులు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

కట్టంగూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులు గాలికుంటు టీకాలను పశువులకు తప్పకుండా వేయించాలని వెటర్నరీ బయాలాజికల్ ఆఫ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (వీబీఆర్ఐ) హైదరాబాద్ ఏడీ నీరజ అన్నారు. మండలంలోని మల్లారం, కట్టంగూరు గ్రామాల్లో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టి గాలికుంటు టీకా కార్యక్రమాన్ని పశువైద్యాధికారి రవికుమార్‌తో కలిసి ఆమె పరిశీలించి మాట్లాడారు. పాడి గేదెలకు గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గి పాడి రైతులకు ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఏ అరుణ, గోపాలమిత్రలు చెరుకు శ్రీనివాస్, కావటి యాదగిరి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


ప్లాస్టిక్ కవర్లను ఉపయోగిస్తే దుకాణం సీజ్


పాలిథీన్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న మునిసిపల్ సిబ్బంది

రామగిరి నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే పాలిథీన్ కవర్లను ఉపయోగిస్తే చర్యలు తప్పవని మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గడ్డం శ్రీనివాస్ హెచ్చరించారు. మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని వివిధ వ్యాపార సముదాయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశంబజార్‌లో పలు దుకాణాల్లో దొరికిన పాలిథీన్ కవర్లను స్వాధీనం చేసుకొని ఆయా షాపుల యజమానులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణాన్ని హాని కలిగించే పాలిథీన్ కవర్లను విక్రయించినా, ఉపయోగించినా షాప్‌లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ శానిటరీ జవాన్లు సయ్యద్, సైదులు, రవి, రాంబాబు, గౌస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో విజయాలు సాధించాలి

కేతేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దాతల సహకారాన్ని అందిపుచ్చుకుని గొప్ప విజయాలు సాధించాలని భీమారం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం భిక్షమయ్య సూచించారు. భీమారం జడ్పీ పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో సమకూర్చిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు.



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	67,674	67,674
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.95 (4.18)	4,132.84	3,983.93
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.604 (45.1540)	55,235	58,800

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పాడి ఆవులు, పాడి గేదెల రక్షణతో పాటు ఇతర పశువుల్లో వ్యాధుల నివారణకు పశుసంవర్ధకశాఖ దృష్టిసారించింది. ప్రధానంగా పశువుల్లో కాళ్లవాపు వ్యాధి అంటే ఎఫ్ఎండీ (ఫుట్ అండ్ మౌత్ డిసీజెస్) రాకుండా ఉండేలా టీకాలను ప్రతీ ఆరు నెలలకోసారి వేస్తున్నారు. ఈ టీకాలతో పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. అందుకు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

పశువుల్లో వ్యాధుల నియంత్రణకు టీకా

ఆవులు, గేదెలతో పాటు ఇతర పశువులను కాళ్ల వ్యాధి నుంచి రక్షించడం టీకాల ముఖ్య ఉద్దేశం. ప్రతీ ఆరునెలలకోసారి క్రమం తప్పకుండా ఈ టీకాలు వేస్తారు. గత నెల 15న ప్రారంభమైన టీకాల కార్యక్రమం ఈనెల 15వ తేదీతో ముగియనుంది. ఎఫ్ఎండీ వ్యాధులతో పాటు ఇతర వైరస్‌లను కూడా నియంత్రించేందుకు ఎఫ్ఎండీ టీకాలతో కలిపి ఇతర టీకాలు కూడా వేస్తారు.

- 70శాతానికి చేరిన ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్
- ప్రతీ పశువు వివరాలు 'భారత్ పశుధన్' యాప్‌లో నమోదు
- ఆరు నెలలకోకసారి టీకాలు
- పాడి ఉత్పత్తులు తగ్గకుండా అధికారుల కార్యాచరణ

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 3.50లక్షల తెల్ల, నల్ల పశువులు అంటే గేదెలు, ఆవులు ఉన్నాయి. పాడి ఉత్పత్తులను పెంచడంతో పాటు వాటిని కాపాడేందుకు, వైరస్ వ్యాప్తిని నియంత్రించేందుకు ప్రభుత్వం టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇప్పటి వరకు 70శాతం వరకు వ్యాక్సినేషన్ పూర్తయింది. ఏటా రెండు సార్లు టీకాలు వేయడం వల్ల వైరస్ వ్యాప్తి తగ్గుముఖం పట్టి పశువులకు రక్షణ కలుగుతోంది. పశుసంపద తగ్గితే పాల ఉత్పత్తులపై పడనున్నందున ప్రతీ గ్రామానికి అధికారులు వెళ్లి టీకాలు వేయనున్నారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా 78 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో డాక్టర్‌తో పాటు ఫార్మసిస్ట్, గోపాల మిత్ర, పశుమిత్రలు ఉంటారు.

పశువుల వివరాలు 'భారత్ పశుధన్' యాప్‌లో

పశువులకు టీకాలు వేయడంతోపాటు పశుసంపద వివరాలను 'భారత్ పశుధన్' యాప్‌లో అధికారులు నమోదు చేయనున్నారు. పశువుకు సంబంధించిన యజమాని, ఇతర వివరాలన్నింటినీ నమోదు చేస్తారు. పశువుకు టీకా ఇచ్చిన వెంటనే రైతు ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వెళ్తుంది. ఆ ఓటీపీ ఆధారంగా వివరాలు నమోదు చేస్తారు. గాలికుంటువ్యాధి నివారణకు టీకా వచ్చినా ఆ వివరాలను యాప్‌లో నమోదుచేస్తారు. దీని ఆధారంగా ఎన్ని పశువులకు టీకా పూర్తయిందో తెలియనుంది. టీకా వేసిన 21 రోజుల తరువాత పశువుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎఫ్ఎండీ అంటువ్యాధికావడంతో టీకా కార్యక్రమం ద్వారా ఇతర పశువులకు ఈ రోగం దరిచేరకుండా ఉంటుంది. అదేవిధంగా ప్రతీ పశువుకు ట్యాగ్ వేస్తారు. ఒకవేళ ట్యాగ్ ఊడినా, తిరిగి టీకాలు వేసే సమయంలో ట్యాగ్‌ను వేసి రికార్డుల్లో నమోదు చేస్తారు.

ప్రతీ పశువుకు టీకా వేయించాలి

గాలికుంటు వ్యాధి నివారణకు సంబంధించిన టీకాలను ప్రతీ రైతు పశువులకు వేయించాలి. ఇప్పటికే 70శాతానికి పైగా టీకాల కార్యక్రమం పూర్తయింది. ఈనెల 15 వరకు ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తాం. ప్రతీ పశువుకు సంబంధించిన యజమాని వివరాలతో పాటు ఆ పశువుకు సంబంధించిన వివరాలన్నీ యాప్‌లో నమోదవుతాయి. ఎఫ్ఎండీ వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రతీ ఆరు నెలలకోసారి టీకా కార్యక్రమం నిర్వహిస్తాం. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. పశుసంపదను కాపాడటం కోసం, పాడి ఉత్పత్తిని పెంచడం కోసం ప్రతీ ఒక్కరు సహకరించి ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

- జీవి.రమేష్, పశుసంవర్థకశాఖ జేడీ, నల్లగొండ

డైట్ కాంట్రాక్టర్ల ఎంపిక 12కు వాయిదా



నల్లగొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో డైట్ సరఫరా కాంట్రాక్టర్ల ఎంపికను ఈనెల 12కు అధికారులు వాయిదా వేశారు. జిల్లాలోని మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ, నకిరేకల్ ఏరియా ఆస్పత్రులతోపాటు మర్రిగూడెంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో రోగులకు ఆహారం అందించే కాంట్రాక్ట్ నిమిత్తం ఏజెన్సీల నుంచి అక్టోబరులో టెండర్లను ఆహ్వానించారు. ఈనెల 4వ తేదీనే టెక్నికల్ బిడ్లతో పాటు ఫైనాన్షియల్ బిడ్లను తెరవాల్సి ఉండగా, టెండర్ల ప్రక్రియ నిర్వహించే కమిటీ చైర్మన్ బాధ్యతల్లో ఉండే అదనపు కలెక్టర్ ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో 7వ తేదీకి వాయిదా వేశారు. తాజాగా, శుక్రవారం సైతం అధికారులు అందుబాటులో లేకపోవడం, ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉన్న నేపథ్యంలో ఈ టెండర్ల ప్రక్రియను 12వ తేదీకి వాయిదా వేశారు. టెండర్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి ఏజెన్సీలను ఎంపికచేస్తామని అధికారులు పేర్కొంటుంటే, మరోవైపు కాంట్రాక్టులు దక్కించుకునేందుకు కొన్ని ఏజెన్సీల నిర్వాహకులు రాజకీయ ఒత్తిడి తెస్తున్నట్లు చర్చ సాగుతోంది. ఈ కాంట్రాక్టుల నిమిత్తం 53 ఏజెన్సీలు టెండర్లు దాఖలు చేశాయి. నిబంధనల ప్రకారం కనిష్ఠ ధర కోట్ చేసిన ఏజెన్సీలకు కాంట్రాక్ట్ అప్పగించాల్సి ఉంటుండగా, అన్ని ఏజెన్సీలు ఒకే ధర కోట్ చేస్తే డ్రా నిర్వహించాల్సి ఉంటుంది.

అయితే నాణ్యమైన డైట్ సరఫరా, ఏజెన్సీల ట్రాక్‌రికార్డు, టర్నోవర్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని కాంట్రాక్టర్లను ఎంపికచేసే కమిటీ చైర్మన్ హోదాలో ఉండే అదనపు కలెక్టర్, కన్వీనర్ హోదాలో ఉండే డీసీహెచ్ఎస్‌కు ఉండే విస్తృతాధికారాల మేరకు నేరుగా ఏజెన్సీ ఎంపికచేసే అవకాశం ఉంది. ఈ వెసలుబాటును అనుకూలంగా మలుచుకునేందుకు రాజకీయనేతల ద్వారా కొందరు ఏజెన్సీల నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించాలని పలువురు ఏజెన్సీల నిర్వాహకులు కోరుతున్నారు.

దేశభక్తి పెంపొందించేందుకే జాతీయ గీతాలాపన

కలెక్టర్ ఇలా త్రిపాఠి



అధికారులతో జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పౌరుల్లో దేశభక్తి భావనను పెంపొందించేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు వందేమాతర జాతీయ గీతం సామూహిక ఆలాపన కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులు, సిబ్బందితో కలిసి వందేమాతరం జాతీయ గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బంకించంద్ర చటర్జీ వందేమాతర గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా జాతీయ గీత సామూహిక ఆలాపన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో మోతిలాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను వేగవంతం చేయాలి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రం సమీపంలో ఎస్ఎల్‌బీసీ కాలనీ వద్ద చేపట్టిన యంగ్ ఇండియా ఇంట్రిగేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను ఆమె తనిఖీ చేశారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి తరగతి గదులు, విద్యార్థులు ఉండేందుకు డార్మెటరీ, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతీ నెల పనులను పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి ఉన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్నకుమార్

నల్లగొండ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానికసంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, పార్లమెంట్‌లో బిల్లును ఆమోదింపజేసి రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్లో చేర్చాలని బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక క్లాక్‌టవర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల చివరలో జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో 42శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేయాలని, లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వంపై ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి బీసీ బిల్లుపై ప్రధాని మోదీని ఒప్పించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు గండిచెరువు వెంకన్నగౌడ్, ఐతగోని జనార్దన్‌గౌడ్, ఎంఏ.ఖదీర్, పుట్ట వెంకన్నగౌడ్, కర్నాటి యాదగిరి, చిలుకరాజు సతీష్, మార్గం సతీష్‌కుమార్, కొంపల్లి రామన్నగౌడ్, చెన్నోజు రాజు, చెన్నోజు భరద్వాజ, కల్లూరి సత్యనారాయణగౌడ్, నీలం వెంకటమధు, అనంత నాగరాజుగౌడ్, గడగోజు విజయ్, తలారి రాంబాబు, ఆమంచి స్వామి, అంబటి శివ, పుల్లెందుల అంజయ్య, గడ్డం మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

డీఆర్డీఏ పీడీ శేఖర్‌రెడ్డి



ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీడీ శేఖర్‌రెడ్డి

త్రిపురారం నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసిందన్నారు. ధాన్యంలో తేమశాతం 17కు మించకుండా ఉండాలని, ఆరబెట్టి తాలు మట్టి లేకుండా తీసుకురావాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో విజయకుమారి, ఏపీవో నాగేందర్‌ల, మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, మర్ల చంద్రారెడ్డి, శ్యాంసుదర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నరేష్, కామర్ల జానయ్య, తదితరులు ఉన్నారు.

ధాన్యం.. దైన్యం

- 10రోజులుగా నిలిచిన కాంటాలు
- రైతుల పడిగాపులు
- తేమ కోసం అధికారుల పేచీ
- ఆరబెట్టేందుకు లోడుకు రోజుకు రూ.1,000
- మార్కెట్ యార్డులో వృథాగా ఉన్న డ్రయ్యర్



కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన ధాన్యం

మిర్యాలగూడ,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తడి, పొడి వాతావరణంలో నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఆరబెట్టలేక సతమతమవుతున్నారు. కాసేపు ఎండ, అంతలోనే మబ్బులు, చినుకుల కారణంగా రోజువారీగా ధాన్యాన్ని ఆరబెట్టి కుప్పపోసేందుకు కూలీలకు రోజుకు రూ.700, ట్రాక్టర్‌కు రూ.1000 ఖర్చు అదనంగా రైతులపై భారం పడుతోంది.

తేమ శాతం తగ్గలేదని అధికారులు కాంటాలు నిలిపివేయడంతో రైతులు రోజుల తరబడి రాశుల వద్దే పడిగాపులు పడుతన్నా రు. మరో వైపు రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు ప్రతికూల వాతావరణంలోనూ ధాన్యాన్ని గంట ల వ్యవధిలో ఆరబెట్టేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన డ్రయ్యర్లు వృథాగా పడివున్నాయి. వీటిని అందుబాటులోకి తెచ్చి ఇబ్బందులను తొలగించాలని రైతులు వేడుకుంటున్నారు.

ఐకేపీ కేంద్రాల్లో ప్రారంభంకాని కొనుగోళ్లు

ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు గడిచినా ఇప్పటి వరకు ఒక్క బస్తా సన్నధాన్యం కూడా కొనుగోలు చేయలేదని రైతులు చెబుతున్నారు. భారీ మొత్తంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తున్నా, తేమశాతం కారణంగా కాంటాలు వేయడం లేదని పేర్కొంటున్నారు. అవంతిపురం మార్కెట్ యార్డులో ఆలగడప, మిర్యాలగూడ, తడకమళ్ల ధాన్యం కొనుగోలుకు మూడు కేంద్రాలను అక్టోబరు 8న ప్రారంభించారు. మూడు కొనుగోలు కేంద్రాలకు కలిపి సుమారు 20వేల బస్తాల బీపీటీ ధాన్యాన్ని రైతులు తీసుకొచ్చారు. కాగా, 10 రోజులు గడిచినా తేమ కారణంగా కాంటాలు వేయకపోవడంతో రోజూ రాశులను ఆరబోసి తిరిగి సాయంత్రం కుప్పపోస్తున్నామని, దీంతో కూలీలకు కొంత చెల్లిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డివిజన్‌లో 23 కేంద్రాలకు ఎనిమిది ప్రారంభం


మిర్యాలగూడ డివిజన్‌లో 23 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉండగా, ఇప్పటి వరకు ఎనిమిది కేంద్రాలే తెరుచుకున్నాయి. వీటిలో నాలుగు కేంద్రాలు దొడ్డురకం, మరో నాలుగు సన్నధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేశారు. కాగా, మాడ్గులపల్లి ఐకేపీలో దొడ్డురకం ఆరు లారీల ధాన్యం కొనుగోలుచేయగా, సన్నరకం నేటికీ కాంటాలు వేయలేదని రైతులు చెబుతున్నారు. సన్నరకం రెండు మూడు రోజులు ఆరబెట్టిన తరువాత నాలుగో రోజు వర్షపు చినుకులు పడుతుండటంతో తిరిగి ఆరబెట్టాల్సివస్తోందని రైతులు వాపోతున్నారు.

వృథాగా డ్రయ్యర్

ప్రతికూల వాతావరణంలోనూ ధాన్యం ఆరబెట్టుకునేందుకు ప్రభుత్వం డ్రయ్యర్లను ఏర్పాటుచేసింది. ప్రయోగాత్మకంగా జిల్లాకు రెండు మంజూరు చేసింది. ఒకటి తిప్పర్తి, రెండోది మిర్యాలగూడ మార్కెట్ ...

- మిగతా 8వ పేజీలో...

ఆరబెట్టేందుకే అధిక డబ్బు ఖర్చయింది



మార్కెట్ యార్డుకు ఎనిమిది రోజుల క్రితం బీపీటీ ధాన్యం తీసుకొచ్చా. నాలుగు రోజులు ఆరబెట్టగానే వర్షం వచ్చి ధాన్యం తడిసింది. తిరిగి మూడు రోజులుగా ఆరబెడుతున్న. ట్రక్కు లోడు ధాన్యం ఆరబెట్టేందుకు రోజుకు ట్రాక్టర్‌కు రూ.1,000, కూలీలైతే ఒక్కొరికి రూ.700 చెల్లించాల్సి వచ్చింది. ఆరబెట్టేందుకు ఇప్పటి వరకు రూ.7వేలు ఖర్చు చేశా. అన్నారం నుంచి అవంతీపురానికి 25కి.మీ దూరం నుంచి రోజు వచ్చి ధాన్యం విక్రయించేంతవరకు రూ.10,000 ఖర్చు వస్తోంది. డ్రయ్యర్‌ను వినియోగంలోకి తెస్తే అధిక వ్యయం నుంచి కాపాడినవారవుతారు.

- గంగుల రామచంద్రయ్య, రైతు, అన్నారం

పత్తి రైతులను ఆదుకోవాలి

కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా చేతికొచ్చిన పత్తి, వరి పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కలెక్టర్ ఇలా త్రిపాఠిని కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో కార్యకర్తలు, రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి కలెక్టర్‌కు ఫోన్‌చేసి రైతు సమస్యలు విన్నవించారు. వర్షాలతో రైతులు సగానికి పైగా పంటలు నష్టపోయారని పేర్కొన్నారు. పండిన కొద్దిపాటి పంట విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. తేమశాతం ఎక్కువగా ఉందని పత్తిని కొనుగోలు చేయకపోవడంతో దళారులను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. అదే పత్తిని దళారులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో దళారుల దందా కొనసాగుతోదని, ఈ ప్రాంతంలో దళారులు ఎంత మంది ఉన్నారో లెక్క తేల్చాలని పోలీసులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దిగుబడులను కొనుగోలు చేయించాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే విన్నవించారు.

ఎల్లమ్మ ఆలయానికి కార్తీకమాస రద్దీ



పూజల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ సతీమణి ఇందిర

కనగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయానికి కార్తీక మాసం రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారిని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సతీమణి ఇందిర దర్శించుకున్నారు. ఆలయంలో జరిగిన కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆమెకు ఆలయ ముఖ్య అర్చకులు మల్లాచారి, అ ర్చకులు దామోదర్‌రావ్ వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారి శేషవస్త్రాలను కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో నాగిరెడ్డి అందజేశారు. అనంతరం మహిళా భక్తులకు అదనపు కలెక్టర్ సతీమణి ఇందిర వాయినాలు ఇచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ జూనియర్ అసిస్టెంట్లు కూసం ఉపేందర్‌రెడ్డి, రాజయ్య, సిబ్బంది శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న లింగయ్య

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌ను వెంటనే విడుదల చేయాలని జిల్లా ధర్మ స్టూడెంట్స్ యూనియన్ (డీఎస్‌యూ) రాష్ట్ర కోకన్వీనర్ తలారి లింగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం డీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యాహక్కు నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందన్నారు. విద్యార్థి సంక్షేమ పథకాల్లో నెలకొన్న దీర్ఘకాలిక జాప్యాన్ని తక్షణమే పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పెండింగ్ బకాయిల కారణంగా ప్రైవే ట్ కళాశాలలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. దీం తో పలు కళాశాలలు ఫీజు చెల్లించాలని విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయన్నారు. అదేవిదంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన, కాలపరిమితితో కూడిన రోడ్ మ్యాప్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుభాష్, పెరిక సురేష్, మహేష్, సిద్దు, కిరణ్, సాయికిరణ్, సందీప్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి *** మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ
8 www.andhrajyothy.com ● శనివారం 8 నవంబరు 2025

పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి : మైనుద్దీన్

డిండి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు ప్రభుత్వం రూ.40వేలు చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ. మైనుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో మొంథా తుఫాన్ వల్ల 252 ఎకరాల్లో పత్తి, 235 ఎకరాల వరి పంట తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. అధికారులు నివేదికలు ఉన్నతాధికారులకు సమర్పించాలని కోరారు. వ్యవసాయ పెట్టుబడులు పెట్టి నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

విశ్రాంత ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్ అందజేయాలి

దేవరకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు 2025-26 సంవత్సరానికి లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లో డిసెంబరులోపు అందజేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు తాటికొట్టి నర్సింహ, అంకం చంద్రమౌళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లో నమోదు చేయకుంటే జనవరి నుంచి పింఛన్ నిలిచిపోతుందని అన్నారు. పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వారు కోరారు.

మత్తు పదార్థాల నివారణకు చర్యలు

రాజు,సీఐ, నాంపల్లి



ఇంటర్వ్యూ Interview

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, గంజాయి, డ్రగ్స్ విక్రయాలపై నిఘా పెంచామని నాంపల్లి సర్కిల్ సీఐ రాజు తెలిపారు. చింతపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

(చింతపల్లి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: రోజురోజుకూ మండలంలో యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి గ్రామాల్లో వివాదాలకు దిగుతున్నారు. వారిపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీఐ: చింతపల్లి మండల కేంద్రంతో పాటు రెండు జిల్లాల కూడలి ప్రముఖ విద్యావ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందిన వెంకటేశ్వరనగర్‌లో నిత్యం పెట్రోలింగ్ చేపడుతున్నాం. హైవేపై వెళ్లే వాహనాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తున్నాం. సమస్యాత్మక ప్రాంతాల్లో మఫ్టీలో గస్తీ చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: వెంకటేశ్వరనగర్ (మాల్)లో కొంతమంది ఆకతాయిలు గంజాయి మత్తులో జడ్పీ హైస్కూల్‌లో ఫ్యాన్లు, బెంచీల ధ్వంసం చేసి వీరంగం సృష్టిస్తూ భయందోళనకు గురి చేస్తున్నారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: రెండు జిల్లాల కూడలి కావడంతో ప్రధానంగా యువత ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌లో నివాసం ఉంటూ గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. యువత హైదరాబాద్ నుంచి గ్రామాలకు వచ్చి ఇతర వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు గతంలో ఫిర్యాదు చేశారు. గంజాయి విక్రేతలను పట్టుకునేందుకు సిబ్బంది పనిచేస్తున్నారు. డ్రగ్స్ తీసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళా బృందాలతో నిరంతరం పాఠశాలలు, కళాశాలలతో పాటు గ్రామాల్లో తగిన చైతన్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సైబర్ నేరగాళ్లు విపరీతంగా తయారై అమాయకులను కొత్త నంబర్లతో ఫోన్ చేసి వేధిస్తున్నట్లు తెలిసింది. వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

సీఐ: వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు అపరిచితులు ఫోన్ చేసినప్పుడు వెంటనే ఎవరూ స్పందించవద్దు. ప్రలోభాలకు లొంగిపోవద్దు. సైబర్ నేరానికి గురైనప్పుడు గంటలోపు పోలీసులకు ఫిర్యాదు చేయాలి. 1930 నెంబర్‌ను సంప్రదించి వివరాలు తెలియజేస్తే రికవరీకి ఎక్కువ అవకాశం ఉంటుంది.

రేషన్ దుకాణాల్లో మగ్గిపోతున్నాయ్

» ముక్కిపోతున్న దొడ్డు బియ్యం
» సన్న బియ్యానికి లక్క పురుగుల బెడద



రేషన్ దుకాణంలో పురుగులు పట్టిన దొడ్డు బియ్యం

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు లబ్ధిదారులకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఏప్రిల్ నుంచి సన్నబియ్యం పంపిణీ చేపడుతోంది. సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో మిగిలిన దొడ్డు బియ్యాన్ని తిరిగి వెనక్కి తీసుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పలువురు రేషన్‌డీలర్లు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి పీఏపల్లి, గుడిపల్లి మండలాల్లో 35 రేషన్‌షాపులు ఉండగా సుమారు 200 నుంచి 300 క్వింటాళ్ల వరకు డీలర్ల వద్ద దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. దొడ్డు బియ్యం నిల్వలు నెలల తరబడి పేరుకుపోయి పురుగులు పట్టి ముక్కిపోతున్నాయి. బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు వాపస్ తీసుకోకపోవడంతో రేషన్‌దుకాణాల్లో ముక్కిపోయి పురుగులు వస్తున్నాయి. అవి ప్రస్తుతం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం సంచులకు సోకి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రేషన్‌డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలతో బియ్యం నిల్వలను భద్రపరచటానికి రేషన్‌డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. మరో పక్క ఎలుకలు, పందికొక్కులు, లక్క పురుగుల బెడద ఉందని ఆవేదన చెందుతున్నారు. కొన్నిచోట్ల ఇరుకు గదులు ఉండటంతో తాజాగా పంపిణీ చేస్తున్న సన్నబియ్యం, పాత దొడ్డు బియ్యం కలిసి ఒకేచోట వేయాల్సి వస్తోందని, దొడ్డు బియ్యాన్ని త్వరగా వెనక్కి తీసుకోకుంటే పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని వాపోతున్నారు. బియ్యం తరిగిపోతే ఆ నష్టాన్ని ఎవరు భరించాలని రేషన్‌డీలర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండల రేషన్ డీలర్లు కోరుతున్నారు.

టెండర్లు పిలుస్తాం



రేషన్‌దుకాణాల్లో మిగిలిపోయిన బియ్యానికి ప్రభుత్వం టెండర్లు పిలుస్తుంది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు సదరు బియ్యానికి మార్కెట్ ధర చెల్లించి తీసుకువెళ్తారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాల్లో మిగిలిపోయిన దొడ్డు బియ్యానికి త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

- రఘునందన్, డీటీసీఎస్, దేవరకొండ

వైభవంగా కార్తీక మాస పూజలు

చింతపల్లి, నవంబరు7(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్ (మాల్)కు చెందిన అయ్యప్ప మాలధారులు కార్తీకమాసం సందర్భంగా పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ వేద మంత్రాలతో గణపతి, సుబ్రమణ్య, అయ్యప్ప స్వామి, లక్ష్మీదేవికి కుంకుమార్చన వైభవంగా చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు మట్టి యాదయ్య, మల్లోజు జగదీశ్వరాచారి, మట్టి యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.



అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వందేమాతరం.. సుజలాం.. సుఫలాం..

వాడవాడలా జాతీయ గీతాలాపన - వైభవంగా జాతీయ గీతం 150వ వార్షికోత్సవం



మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సామూహిక వందేమాతర గీతాలాపన

మిర్యాలగూడ టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ దేశ భక్తిని పెంపొందించుకోవాలని మిర్యాలగూడ మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. జాతీయగీతం (వందేమాతరం) 150వ వార్షికోత్సవాన్ని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందేమాతర గీతాలాపనను సామూహికంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన గీతాలాపనలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వందేమాతర గీతాన్ని ఆలపించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో అధికారులు జ్ఞానేశ్వరి, శ్వేత, వెంకటరమణ, అంజయ్య కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణ శివారులోని ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన గీతాలాపన కార్యక్రమంలో టీడీపీ నాయకులు లావుడి లింగానాయక్, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది జాతీయపతాకాన్ని ప్రదర్శిస్తూ వందేమాతరం గీతాన్ని సామూహిక గీతాలపన చేశారు. కార్యక్రమంలో డివిజనల్ పరిపాలన అధికారి శర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చింతపల్లి: సమాజంలోని ప్రతి ఒక్కరూ దైవభక్తితో పాటు దేశ భక్తిపై ఆసక్తి చూపాలని మండల క్లస్టర్ వైద్యాధికారి శ్రీదేవి తెలిపారు. చింతపల్లి మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో జాతీయగీతాన్ని ఆలపించారు. దేశ భద్రత కోసం మహనీయుల కృషి అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో ఇక్బాల్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర: మండలంలోని పోతునూరు ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకట్రాంనాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు వందేమాతరం గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు పోగొట్టుకున్న అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్మూర్తి, మెహజాబి, గులాంఅంజాద్, అంజుమ్‌ఆరా, బేబీలత, ధర్మారెడ్డి, అనిత, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

హాలియా: దేశ స్వాతంత్రోద్యమ సమయంలో వందేమాతర గేయం దేశ ప్రజలను ఏకం చేసిందని ఉద్యమకారుల్లో ఉత్తేజం నింపిందని హాలియా న్యూకిడ్స్ పాఠశాల డైరెక్టర్ మనాది రవీందర్ అన్నారు. పాఠశాలలో విద్యార్థులు జాతీయ జెండాతో వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మనాది శ్రీలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ మునిసిపల్ కార్యాలయంలో వందేమాతర గీతాలాపన

గుర్రంపోడు: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఉదయం సామూహిక వందేమాతర గీతాన్ని ఆలపించారు.

దేవరకొండ: వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవరకొండ మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాల, మునిసిపాలిటీ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో శుక్రవారం వందేమాతర గీతాలాపాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వందేమాతర గీతాన్ని ప్రత్యేకంగా ఆలపించి జాతీయ భావాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్, ఏఈ రాజుతో పాటు మునిసిపల్ సిబ్బంది, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, అధ్యాపకులు పాల్గొన్నారు.



దేవరకొండ మునిసిపల్ కార్యాలయంలో వందేమాతరం ఆలపిస్తున్న మునిసిపల్ ఉద్యోగులు, అధికారులు

రైతులను సాగు నుంచి దూరం చేసేందుకు కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

దామరచర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులను వ్యవసాయం నుంచి దూరం చేసేందుకు కేంద్రప్రభుత్వం కుట్రలు చేస్తోందని, దీనిని వ్యతిరేకించేందుకు రైతులు సంఘటితంగా పోరాడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతి విపత్తులు అన్ని పంటలపై ధర ప్రభావం చూపుతున్నాయని, పత్తి క్వింటాలుకు రూ.8,110 కొనుగోలు చేయాల్సి ఉండగా ఈ విధంగా నిబంధనలు పెట్టడంతో రైతు బయట మార్కెట్‌లో రూ.6వేల నుంచి రూ. 4వేలకు అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వర్షాలతో పత్తి నాణ్యత దెబ్బతిన్నదని, ఒకవైపు దిగుబడి తగ్గి రైతులు ఆందోళన చెందుతుంటే సీసీఐ నిబంధనలు రైతులను మరింత గోస పెడుతున్నాయని అన్నారు. రైతులు తమ హక్కుల పరిరక్షణ కోసం సంఘటితంగా పోరాడాలని అన్నారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మాలోతు వినోద్‌నాయక్, కార్యదర్శి గోలి వెంకట్‌రెడ్డిలతోపాటు 17 మంది కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్, ఎర్రనాయక్, దయానంద్, పాపానాయక్, బొచ్చు కోటిరెడ్డి, శ్రీహరి, సుభాని, కాంతారావు, మట్టయ్య, దుర్గయ్య, శ్రీనునాయక్, ఖాజామొయినుద్దీన్, చంద్రకళ, బాలు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

దేవరకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం పద్మట్‌పల్లి గ్రామానికి చెందిన సీపీఐ ఉద్యమ నిర్మాత, మాజీ సర్పంచ్, దివంగత పల్లా కృష్ణారెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. దేవరకొండ మండలం పద్మట్‌పల్లిలో శుక్రవారం కృష్ణారెడ్డి వర్ధంతి పురస్కరించుకొని ఆయన స్మారకస్తూపం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కమ్యూనిస్టు పార్టీ నేతగా, పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని గుర్తు చేశారు. సర్పంచ్‌గా సేవలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూం బుచ్చిరెడ్డి, పల్లా రంగారెడ్డి, ఆంజనేయులు, యాదయ్య, భూపాల్‌రెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఆశా వర్కర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

దేవరకొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం బొడ్డుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పద్మట్‌పల్లి ఆశావర్కర్ సుశీల మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం బొడ్డుపల్లి పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఆశా వర్కర్లు సమీకరించిన రూ.19 వేలను సుశీల భర్త వెంకటయ్యకు మెడికల్ అధికారి డాక్టర్ విజయ అందజేశారు. ఆశావర్కర్ కుటుంబానికి ఆశా వర్కర్ల సంఘం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు, సూపర్‌వైజర్లు లింగయ్య, సఫియా, వినోద్, అనసూయ, సుమలత, స్వప్న, ధనమ్మ, అనిత, మమత పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

గుర్రంపోడు: మండలంలోని కట్టవారిగూడెం గ్రామానికి చెందిన షేక్ బాబు నెల రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దీంతో గ్రామస్థులందరూ కలిసి శుక్రవారం మాజీ సర్పంచ్ చాడ చక్రవర్తి ఆధ్వర్యంలో అతని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కట్ట శ్రీశైలం, కట్ట లింగయ్య, పరసనబోయిన వెంకన్న, కట్ట రామకృష్ణ, వెంకటేశం, చాడ రాంబాబు, కట్ట మల్లేష్, రవి, నర్సింహ, ఏడుకొండలు, సైదులు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ప్రణాళిక

చింతపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)లోని జడ్పీ హైస్కూల్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు హెచ్‌ఎం కృష్ణవేణి తెలిపారు. 'వీటీనగర్ జడ్పీహెచ్ఎస్‌లో ఆకతాయిల హల్‌చల్' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఎంఈవో అంజయ్య స్పందించారు. ప్రభుత్వ పాఠశాలల సంరక్షణకు హెచ్‌ఎంలు, టీచర్లు బాధ్యతాయుతంగా పని చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎం కృష్ణవేణి అధ్యాపకులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మన పాఠశాలను మనమే పరిరక్షించుకోవాలి అనే శీర్షికతో వాట్సాప్ గ్రూప్‌ను తయారు చేశారు. విధివిధానాలపై పలు సూచనలు అందించారు. పూర్వ విద్యార్థులందరూ కలిసి వాట్సప్ గ్రూపులో అందరి భాగస్వామ్యంతో పాఠశాలల్లో ఆకతాయిల అడ్డుకట్ట వేసేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం నగదు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. పాఠశాల సంరక్షణకు రూ.5లక్షలు తయారు చేసినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



పేర్వాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ ఉమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం యాదవ్

నేరేడుగొమ్ము, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలంయాదవ్ అన్నారు. నేరేడుగొమ్ము మండలం పేర్వాలలో శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించి 17శాతం తేమ కలిగిన గ్రేడ్-ఏ రకానికి రూ. 2,389, గ్రేడ్-బీ రకానికి రూ.2369 ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. రైతులు ధాన్యాన్ని తమ పొలం వద్దనే ఆరబెట్టుకొని తాలు, మట్టి పెళ్లలు లేకుండా తీసుకురావాలని సూచించారు. రైతులు వరి ధాన్యంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం తప్పనిసరిగా జీరాక్స్ తీసుకురావాలన్నారు. రైతు యొక్క ఆధార్ నెంబర్‌ను ఫోన్ నెంబర్‌కు లింక్ చేసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో నిర్వాహకులకు ప్రతీరోజు తేమ చూసి ఎప్పటికప్పుడు ధాన్యం లారీల్లో లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాదేవి, డీటీ మోబిన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మల్లేష్



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మిర్యాలగూడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. కార్మికులకు అవసరమైన యూనిఫాం, సబ్బులు, నూనె, చెప్పులు అందజేయాలని అన్నారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాలను కాపాడేందుకు రోజూ బెల్లం అందించాలని కోరారు. నెలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, ప్రతీ శని ఆదివారాల్లో ఒక పూట సెలవు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వీరెపల్లి వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, జిల్లా నాయకులు తిరుపలి రాంమూర్తి, ఎంసీపీఐ నాయకులు వస్కుల మట్య్య, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకన్న, మోహన్, ఎల్లయ్య, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కలశాల శోభాయాత్ర



కలశాల శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

కొండమల్లేపల్లి, నవంబరు7(ఆంధ్రజ్యోతి):కొండమల్లేపల్లి మండలకేంద్రంలో శుక్రవారం గాయత్రీ కలశాల శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. అఖిల విశ్వ గాయత్రి పరివార్ శాంతి కుంజ్ హరిద్వార్ కొండమల్లేపల్లి శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో గల మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న 108 కుండముల గాయత్రి జ్ఞాన మహాయజ్ఞంలో భాగంగా తొలిరోజు శుక్రవారం పట్టణంలో 560 కలశాలతో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో భక్తి గీతాలు పాడుతూ భజనలు, కోలాటాలు ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వాహక సభ్యులు మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి మంచి జరగాలని తొలిసారిగా కొండమల్లేపల్లిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గాయత్రీ జ్ఞాన మహాయజ్ఞంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు వింజమూరి చంద్రమౌళి, సత్యనారాయణ, దాచేపల్లి వెంకటేశ్వర్లు, ఏరుకొండ రాము, జగన్, మారం వెంకన్న, నేలంటి వెంకటేశ్వర్లు, ధనుంజయ, వరలక్ష్మి, నాగార్జునరెడ్డి, కుషాల్, వాసు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

పెద్దవూర, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా సెక్రటరీ ఏరుకొండ నరసింహ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులతో కలిసి శుక్రవారం సబ్ మార్కెట్‌యార్డులో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలకేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్‌యార్డులో రైతులు ధాన్యం తీసుకొచ్చి 20 రోజులవుతున్నా ఇప్పటివరకు కొనుగోలు చేయలేదని, దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. రైతులు ధాన్యం తీసుకొచ్చి 20 రోజులువుతున్నా కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలతో తడిసి ముద్దవుతున్నాయని, వర్షాలు కురిసే సమయంలో కనీసం టార్పాలిన్లు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. సన్నధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామన్న ప్రభుత్వం గత సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు రైతులకు అందించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కాంటాలు వేసి కొనుగోలు చేయాలన్నారు. లేనియెడల బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఏరుకొండ పద్మ, మండల ఉపాధ్యక్షుడు జూలకంటి మట్టారెడ్డి, నాయకులు రమావత్ సుమన్‌నాయక్, శ్రీనునాయక్, రైతులు వడ్డేపల్లి వెంకట్‌రెడ్డి, కంచర్ల రేణుక, చిట్టిమల్ల లక్ష్మమ్మ, వడ్డేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నిర్మల, గీత, ఎల్లమ్మ, శ్రీను, ధను పాల్గొన్నారు.

రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మిర్యాలగూడ టౌన్: రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. బీసీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుఫాన్లు, వరదల కారణంగా ధాన్యం తడిసి ముద్దయిందని, నీళ్లలో నానిన ధాన్యం రంగు మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అధికారులు మిల్లర్లతో మాట్లాడాలని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సిరసనగండ్ల ఈశ్వరాచారి, చేగండి మురళీయాదవ్, నాయుడు, రాములు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం.. దైన్యం

(5వ పేజీ తరువాయి)

యార్డుల్లో ఏర్పాటు చేశారు. 45 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న ట్రాక్టర్‌కు పుల్లీ ఏర్పాటు చేసి డయ్యర్‌కు అనుసంధానిస్తేనే యంత్రం పనిచేస్తుంది. మిషన్ వినియోగించే రైతులు 45 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న ట్రాక్టర్ తీసుకొస్తే, 30 లీటర్ల డీజిల్‌తో 25 క్వింటాల ధాన్యాన్ని ఆరబెట్టవచ్చు. దీంతో సమయం కలిసిరావడమేగాక, మార్కెట్‌లో పడిగాపులు తప్పుతాయి. ధాన్యం రంగు మారకుండా సకాలంలో కాంటాలు వేయడం, లేదా బస్తాల్లో నింపి నిల్వ చేసుకునేందుకు అనువుగా ఉంటుంది. అయితే చిన్న, సన్నకారు రైతుల వద్ద ట్రాక్టర్లు లేవు. పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ట్రాక్టర్‌ను ఏర్పాటు చేస్తే డ్రయ్యర్ల ద్వారా ధాన్యాన్ని ఆరబెడతామని రైతులు చెబుతున్నారు.

డ్రయర్‌ను అందుబాటులోకి తెస్తాం

ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు అవంతిపురం మార్కెట్‌కు ప్రభుత్వం డ్రయ్యర్‌ను సరఫరా చేసింది. ప్రస్తుతం అది డెమో దశలోనే ఉంది. రెండు రోజుల్లో మెకానిక్ వచ్చి పనిచేసే విధానం వివరిస్తాడన్నారు. ట్రాక్టర్ పుల్లీ ఉన్న రైతులకు ధాన్యం ఆరబెట్టుకునేందుకు పూర్తిస్థాయిలో యంత్రాన్ని అందుబాటులో ఉంచుతాం. ఐకేపీల్లో ధాన్యం తడవకుండా కప్పేందుకు 20 చొప్పున టార్పాలిన్లు అందుబాటులో ఉంచాం.

- వెంకటేష్, మార్కెట్ కార్యదర్శి